

ప్రజాస్ఫూర్తి
PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక
PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 11-09-2026 | సంపుటి - 31 | సంచిక - 109 | రూ : 4 | పేజీలు: 8

### ప్రతిపక్షం కుట్రను

# బలంగా తిప్పికొట్టాం..

## 3 రోజుల ఘటనలపై ఫ్లాష్ సర్వే చేయించాం



- భారాస తీరును జనం తప్పుపడుతున్నారు
- సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: ప్రతిపక్షం ప్రభుత్వంపై చేసిన కుట్రను, దుష్ప్రచారాన్ని బలంగా తిప్పి కొట్టామని, వెయ్యిరోజుల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కూడా బాగా ప్రజల్లోకి తీసుకెళ్లామని, ఇదే ఒరవడిని కొనసాగిద్దామని ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్బోధించారు. ప్రభుత్వం చేసే మంచి పనులు ప్రజల్లోకి వెళ్లకుండా చూసేందుకు, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు నిత్యం ఏదో ఒక కుట్రకు తెరలేపుతుంటారని.. అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ ముందుకెళ్లాలని సూచించారు. 'మూడు రోజులుగా జరిగిన పరిణామాలపై ప్రభుత్వం ఫ్లాష్ సర్వే చేయించింది. భారాస తీరును జనం తప్పుపడుతున్నారు. కాంగ్రెస్‌పై ప్రజల్లో చాలా పాజిటివ్

తరువాయి 2లో




### రూ.250 కోట్ల విలువైన భూమికి

## రూ.7 కోట్లా?

- బీజేపీ, కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎక్కడికి పోయాయి
- సీఎం అన్నదమ్ములకు రూ.వందల కోట్ల విలువైన భూములా..!
- ప్రజా సంక్షేమానికి పైసల్లేవా.. దొంగలను పట్టాల్సిన హోంమంత్రి అమిత్ షా ఎక్కడ?
- ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ మాయాజాలం : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సీఎం సోదరుడు కొండల్‌రెడ్డి టెస్సెరాక్ట్ కంపెనీకి కేటాయించిన భూమి వద్ద బీఆర్ఎస్ నిరసన

2లో

### ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు..

## సర్వం సిద్ధమన్న ప్రధాని మోదీ




- ఈ వారాంతంలో ఢిల్లీ వేదికగా బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు
- సర్వం సిద్ధం అంటూ ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్
- హాజరుకానున్న రష్యా, చైనా అధ్యక్షులు పుతిన్, జిన్‌పింగ్
- రాజధానిలో 15,000 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత
- భారత్‌కు ఇది నాలుగోసారి అధ్యక్ష బాధ్యత

2లో



### గల్వాన్ తర్వాత తొలిసారి

## మోదీ-జిన్‌పింగ్ భేటీకి రంగం సిద్ధం?

- సెప్టెంబర్ 12, 13న ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు
- మోదీ-జిన్‌పింగ్ ద్వైపాక్షిక భేటీకి అవకాశం
- 2020 గల్వాన్ తర్వాత ఇదే తొలి ముఖాముఖి చర్చ
- అజిత్ దోవల్ ఇటీవల చైనాలో చర్చలు
- సరిహద్దు, వాణిజ్యం, భద్రతపై చర్చకు అవకాశం

ఐదేళ్లుగా దూరంగా ఉన్న భారత్‌చైనా సంబంధాల్లో కీలక పరిణామం చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది. ఢిల్లీలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో జరగనున్న బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ద్వైపాక్షిక భేటీ జరిగే అవకాశముంది. అదే జరిగితే 2020 గల్వాన్

తరువాయి 2లో

### చైనా షిప్‌యార్డ్‌లో అగ్నిప్రమాదం..

## కార్గో నౌకలో 20 మంది మృతి



- చైనాలోని కింగ్‌డావో షిప్‌యార్డ్‌లో కార్గో నౌకలో భారీ అగ్నిప్రమాదం
- ఈ దుర్ఘటనలో 20 మంది సిబ్బంది మృతి, ఐదుగురు గల్లంతు
- మరమ్మతుల కోసం ఆగిన 'ఓషన్ మెలోడీ' నౌకలో ఘటన
- సహాయక చర్యలు వేగవంతం చేయాలని అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆదేశం

2లో

### జోర్డాన్‌లోని యూఎస్ బేస్‌పై ఇరాన్ దాడి

## పలు యుద్ధ విమానాలు ధ్వంసం

- దాడిలో పలు యూఎస్ యుద్ధ విమానాలు దెబ్బతిన్నాయని రిపోర్ట్
- ఇరాన్ దాడులను పాట్రియాట్ క్షిపణులతో తిప్పికొట్టిన అమెరికా దళాలు
- ఎన్నికల తర్వాత యుద్ధం ముగియవచ్చన్న డొనాల్డ్ ట్రంప్



2లో

### మనం సృష్టించిన మేధస్సు..

## మనల్నే మింగేస్తే? ఏఐపై ఎందుకీ దిగ్గజాల హెచ్చరికలు?

- ఏఐ మానవాళికి ముప్పుగా మారొచ్చంటూ నిపుణుల హెచ్చరిక
- పదేళ్లలో సూపర్ ఏఐ ప్రమాదాన్ని ప్రస్తావించిన జాకబ్ కాక్సన్
- ఏఐ సంస్థలు బాధ్యతగా వ్యవహరించడం లేదని ఆరోపణ
- ఏఐ నియంత్రణపై ఆందోళన వ్యక్తం చేస్తున్న మస్క్
- మనుషులను ఏఐ మించిపోవచ్చన్న జెఫ్రీ హింటన్



ఒకప్పుడు మనిషి యంత్రాలకు ఆలోచించడం నేర్పించాలని కలలు కన్నాడు. ఇప్పుడు ఆ యంత్రాలే మనిషిని మించి ఆలోచిస్తే? అదే జరిగితే పరిస్థితి ఎలా ఉంటుంది? మనిషి ఆపలేని స్థాయికి కృత్రిమ మేధస్సు చేరితే ఏం జరుగుతుంది? ఇది ఇక సైన్స్ ఫిక్షన్ కథల్లో మాత్రమే కనిపించే ప్రశ్న కాదు. ప్రపంచంలోని ప్రముఖ ఏఐ నిపుణులు, టెక్ దిగ్గజాలు ఇదే విషయంపై తీవ్రంగా హెచ్చరిస్తున్నారు. జీవితాలతో జూదమాడుతున్నారా? తాజాగా జాకబ్ కాక్సన్

తరువాయి 2లో



### లాల్ మందిర్‌ను టార్గెట్ చేశారు..

## ఎర్రకోట వద్ద పేల్చారు..

- 2025 ఢిల్లీ పేలుళ్లలో ఎర్రకోట ఉగ్రవాదుల అసలు లక్ష్యం కాదు
- చాందినీ చౌక్‌లోని లాల్ మందిర్ వద్ద దాడికి తొలుత ప్లాన్
- ట్రాఫిక్, భద్రత కారణంగా చివరి నిమిషంలో ప్రణాళిక మార్పు
- ఎన్ఐఏ చార్జిషీట్‌లో సంచలన విషయాలు వెల్లడి
- ఆత్మాహుతి దాడిలో 11 మంది మృతి.. 29 మందికి గాయాలు

2లో

# ప్రతిపక్షం కుట్రను బలంగా తిప్పికొట్టాం

(మొదటిపేజీ తరువాయి)

అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ ముందుకెళ్లాలని సూచించారు. 'మూడు రోజులుగా జరిగిన పరిణామాలపై ప్రభుత్వం ఫ్లాష్ సర్వే చేయించింది. భారాస తీరును జనం తప్పుపడుతున్నారు. కాంగ్రెస్‌పై ప్రజల్లో చాలా పాజిటివ్ అభిప్రాయం ఉంది. పోలీసులు చాలా ఓర్పుతో ఉన్నారు' అని వివరించారు. గురువారం సాయంత్రం అసెంబ్లీలోని కమిటీ హాలులో సీఎల్పీ సమావేశం జరిగింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, జి.వివేక్‌లు పలు అంశాలపైన మాట్లాడారు. తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి.

**22ఏలో ఉన్నది 3.06 లక్షల ఎకరాలే**

''అసెంబ్లీ ఎదుట జరిగిన సంఘటనల సందర్భంగా ఎమ్మెల్యేలు, మంత్రులు పార్టీకి అండగా నిలబడ్డారు. 1,000 రోజుల పాలనకు సహకరించినందుకు అందరికీ ధన్యవాదాలు. మీ సహకారంతో దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తీసుకువచ్చాం. 22ఏలో కోటి ఎకరాలు ఉన్నాయని భారాస వారు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. 3.06 లక్షల ఎకరాలు మాత్రమే 22ఏలో ఉన్నాయి. సర్ కోసం రెండు రోజులు కొడంగల్‌లో నేను ఉన్నా. ఎమ్మెల్యేలందరూ అదే విధంగా నియోజకవర్గాల్లో తిరిగి దానిపై దృష్టిపెట్టాలి. సర్ పేరుతో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోంది. దేశంలో వయోజనుల జనాభా 103 కోట్లుగా తేల్చారు, కానీ ఓటర్ల జాబితా మాత్రం 88 కోట్లుగా చూపుతున్నారు. దాదాపు 15 కోట్ల ఓట్లు గల్లంతయ్యాయి. ఎక్కడో ఏదో ప్రమాదం పొంచి ఉంది. ఎమ్మెల్యేగా గెలవాలనుకునే ప్రతి ఒక్కరు ప్రజల ఓటు హక్కును కాపాడే అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలి. ఎమ్మెల్యేల ప్రవర్తన రెండోసారి గెలుపుపై ప్రభావం చూపుతుంది. మీ వ్యక్తిగత పనితీరు మీ గెలుపు ఓటములను ప్రభావితం చేస్తుంది. తెలంగాణ నమూనాను రోల్‌మోడల్‌గా తీసుకుని జనగణనలో కులగణన చేపట్టాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి.

**మహిళా అధికారులను ఇబ్బంది పెట్టారు**

భారాస నేతలు అధికారుల పట్ల అనుచితంగా వ్యవహరించారు. మహిళా అధికారుల ముందు టీషర్టులు విప్పి ఇబ్బంది పెట్టారు. శాసనసభాపతిని అత్యంత అభ్యంతరకరంగా దూషించారు. నిరసన తెలిపేందుకు ఎస్సీ విభాగం కార్యక్రమం చేపడితే దళితులు నడిచిన నేలను శుద్ధి చేసి అవమానించారు. ప్రభుత్వంపై ప్రతిపక్షం చేసిన కుట్రను బలంగా తిప్పి కొట్టి, ప్రజలకు వాస్తవాలను తెలియజేసినందుకు మిమ్మల్ని అభినందిస్తున్నా. జరిగిన సంఘటనలపై విచారణ చేపట్టాం.

* **పోలీస్ సిబ్బందిలో కేటీఆర్‌కు రేవంత్ కనిపించారనుకుంట...**

తప్పనిసరిగా సభలో జరిగే చర్చల్లో పాల్గొనండి. సభలో హాజరు శాతం తగ్గకుండా చూసుకోవాలి. ప్రజలు ఇచ్చిన ప్రజాప్రతినిధి హోదాను సరైన విధంగా ఉపయోగించుకోకపోతే భవిష్యత్‌లో రాజకీయంగా రాణించలేరు. అందరికీ వెసులుబాటుగా ఉండాలని అత్యంత చారిత్రక భవనంలో శాసన మండలి నిర్వహిస్తున్నాం. అసెంబ్లీలో సెంట్రల్ హాల్‌ను ప్రారంభించుకుని దుద్దిళ్ల శ్రీపాదరావు పేరు పెట్టుకున్నాం. సభలో ఎవరి నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలు వారు ప్రస్తావించాలి. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోతే ఇప్పుడు భారాసలో ఉన్న సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా? పోలీస్ సిబ్బందిలో కేటీఆర్‌కు రేవంత్‌రెడ్డి కనిపించారనుకుంట. ఎంతో ఆక్రోశంతో అధికారులపై దాడులు చేశారు'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

## రూ.250 కోట్ల విలువైన భూమికి రూ.7 కోట్లా?

(మొదటిపేజీ తరువాయి)

సీఎం రేవంత్‌రెడ్డి తమ్ముడు కొండల్ రెడ్డి టెస్సెరాక్ట్ కంపెనీకి రూ.250 కోట్ల విలువైన భూమిని రూ.7 కోట్లకే కేటాయించిన వ్యవహారంపై బీజేపీ, కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకు స్పందించడం లేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. 'ఈడీ, ఐటీ, సీబీఐలు మాపై కేసులు పెట్టడానికే ఉన్నాయా? అధికారంలో ఉన్నవారి వ్యవహారాలు కనిపించడం లేదా' అని నిలదీశారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ప్రాంతంలో కొండల్ రెడ్డి టెస్సెరాక్ట్ కంపెనీకి ప్రభుత్వం కేటాయించిన భూములను గురువారం కేటీఆర్ నేతృత్వంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పరిశీలించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'తెలంగాణ ఏటీఎంగా మారిందని ప్రధాని చెబుతున్నారు. మరి తెలంగాణను కొల్లగొడు తున్నారని ఆరోపిస్తున్నప్పుడు దొంగలను పట్టుకోవాల్సిన హోంమంత్రి ఎక్కడున్నారు...? ఇంత పెద్ద వ్యవహారం జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు' అని ప్రశ్నించారు. సీఎం కుటుంబ సభ్యులకు ప్రభుత్వ భూములు, రాయితీలు, మినహాయింపులు ఇవ్వడం అధికార దుర్వినియోగం కాదా, ప్రయోజనాల సంఘర్షణ కాదా, కుటుంబ పాలన కాదా అని ఆయన నిలదీశారు.

## గల్వాన్ తర్వాత తొలిసారి మోదీజిన్‌పింగ్ భేటీకి రంగం సిద్ధం?

(మొదటిపేజీ తరువాయి)

ఘర్షణ తర్వాత ఇద్దరు నేతలు ముఖాముఖి చర్చలు జరపడం ఇదే తొలిసారి అవుతుంది. జిన్‌పింగ్ శనివారం భారత్‌కు రానున్నట్లు సమాచారం. ఏడేళ్ల తర్వాత ఆయన భారత్‌లో అడుగుపెట్టనున్నారు. ఇటీవల కిర్గిస్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులో మోదీ, జిన్‌పింగ్ ఒకే వేదికపై కనిపించి కరచాలనం చేసుకున్నారు. అయితే అప్పుడు ద్వైపాక్షిక చర్చలు జరగలేదు. ఇప్పుడు బ్రిక్స్ వేదికగా భేటీ జరిగితే ఇరుదేశాల సంబంధాలపై దాని ప్రభావం కీలకంగా ఉండొచ్చు.

**సరిహద్దు నుంచి వాణిజ్యం వరకు..**

జిన్‌పింగ్ పర్యటనకు ముందు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ చైనాలో ఉన్నతస్థాయి చర్చలు జరిపారు. సరిహద్దు వ్యవహారాలపై డబ్ల్యూఎంసీసీ సమావేశం తర్వాత ఇరుదేశాల ప్రత్యేక ప్రతినిధుల చర్చలు కూడా జరిగాయి. తాజా భేటీలో సరిహద్దు సమస్య, వాణిజ్యం, పెట్టుబడులు, భద్రత, ఎల్‌ఏసీ వద్ద ఉద్రిక్తతలు మళ్లీ తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలు చర్చకు వచ్చే అవకాశం ఉంది.

**అరుణాచల్ ప్రదేశ్.. మరో కీలక అంశం**

లడఖ్‌లో ఉద్రిక్తతలు తగ్గినా సరిహద్దు వివాదం మాత్రం పరిష్కారం కాలేదు. ముఖ్యంగా అరుణాచల్ ప్రదేశ్‌పై చైనా చేస్తున్న వాదనలను భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అరుణాచల్ ప్రదేశ్ తమ భూభాగమని చైనా చెబుతుండగా.. భారత్ దాన్ని పూర్తిగా తిరస్కరిస్తోంది. ఇటీవల అప్పర్ సుబన్‌సిరి ప్రాంతంలో చైనా సైనిక కదలికలపై వచ్చిన నివేదికలు కూడా ఆందోళన పెంచాయి. ఇలాంటి పరిస్థితుల్లో మోదీ జిన్‌పింగ్ భేటీ జరిగితే సరిహద్దులో శాంతి, స్థిరత్వంపై భారత్ తన వైఖరిని మరోసారి స్పష్టం చేసే అవకాశం ఉంది. అమెరికా సుంకాలు, పశ్చిమాసియాలో అస్థిరత నేపథ్యంలో ఇరుదేశాల మధ్య ఆర్థిక, దౌత్య సంబంధాలను ఎలా ముందుకు తీసుకెళ్లాలన్నదీ చర్చకు రావచ్చు.

## మనం సృష్టించిన మేధస్సు.. మనల్నే మింగేస్తే? ఏఐపై ఎందుకీ దిగ్గజాల హెచ్చరికలు?

(మొదటిపేజీ తరువాయి)

చేసిన వ్యాఖ్యలు ఈ చర్చను మరోసారి ముందుకు తెచ్చాయి. ఆంత్రోపిక్ నుంచి తప్పుకొన్న ఆయన గతంలో ఓపెన్‌ఏఐలోనూ పనిచేశారు. ఏఐ సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదన్న ఆందోళనతో బయటకు వచ్చినట్లు చెప్పారు. ''మన జీవితాలతో జూదమాడుతున్నారు'' అంటూ ఏఐ సంస్థలపై తీవ్ర ఆరోపణలు చేశారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏఐ.. మనుషులందరినీ చంపగల ఆర్టిఫిషియల్ సూపర్ ఇంటెలిజెన్స్‌గా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అది వచ్చే పదేళ్లలోనే జరగొచ్చని ఆయన అంచనా వేశారు.

**మస్క్ భయం కూడా ఇదే**

ఇది కాక్సన్ ఒక్కడి అభిప్రాయం కాదు. టెస్లా అధినేత ఎలాన్ మస్క్ చాలాకాలంగా ఇదే ప్రమాదాన్ని ప్రస్తావిస్తున్నారు. మనుషుల కంటే ఎన్నో రెట్లు తెలివైన ఏఐను నియంత్రించడం కష్టమవుతుందని హెచ్చరిస్తున్నారు. విద్యుత్ గ్రిడ్లను హ్యాక్ చేయడం, నీటి సరఫరాలను నిలిపివేయడం, ప్రమాదకర జీవ ఆయుధాల రూపకల్పనకు ఏఐను ఉపయోగించడం వంటి ముప్పుల్ని ఆయన ప్రస్తావించారు. అయితే ఈ హెచ్చరికలు సాధారణ ఏఐ గురించి కాదు. మనిషి చేసే దాదాపు అన్ని మేధో పనులను చేయగల ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (ఏజీఐ) గురించి. ఈ విషయం మస్క్‌కు ప్రత్యేకంగా కీలకం. ఎందుకంటే ఆయన ఏఐ రంగంలో పెట్టుబడులు పెట్టడంతో పాటు ఆటోమేటిక్ కార్ల సాంకేతికతలోనూ ముందున్నారు.

**మనల్ని మించిపోతే?**

ఏఐ రంగంలో 'గాడ్‌ఫాదర్'గా పేరున్న జెఫ్రీ హింటన్ కూడా గూగుల్ నుంచి తప్పుకొన్న తర్వాత ఇదే ప్రమాదాలపై బహిరంగంగా మాట్లాడుతున్నారు. ఏజీఐ మనుషులను మేధస్సులో అధిగమించవచ్చని ఆయన హెచ్చరిస్తున్నారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం, మనుషులను ప్రభావితం చేయడం, అధికారాన్ని సంపాదించాలనే ప్రమాదకర లక్ష్యాలను స్వయంగా ఏర్పరచుకోవడం వంటి పరిణామాలు సంభవించవచ్చని చెబుతున్నారు. ట్యూరింగ్ అవార్డు గ్రహీత యోషువా బెంగియో సైతం అత్యాధునిక ఏఐ అభివృద్ధిపై కఠిన నిబంధనలు కోరుతున్నారు. భద్రతకు సంబంధించిన ప్రమాణాలు నిరూపితమయ్యే వరకు శక్తిమంతమైన ఏఐ మోడళ్ల శిక్షణను నియంత్రించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.

**భయం ఒక్కటే కాదు.. బాధ్యత కూడా**

గూగుల్ డీప్‌మైండ్ సీఈఓ డెమిస్ హసాబిస్, ఓపెన్‌ఏఐ చీఫ్ సైంటిస్ట్ పాకోచ్కీ, సామ్ ఆల్ట్‌మన్, ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ కూడా ఏఐ వల్ల మానవాళి అంతరించిపోయే ప్రమాదాన్ని తగ్గించాల్సిన అవసరాన్ని అంగీకరించారు. ఇది ప్రపంచ స్థాయి ప్రాధాన్య అంశమని పేర్కొన్నారు. ఏఐ మనిషి సృష్టించిన అద్భుతమైన సాంకేతికత. కానీ అదే సాంకేతికత మనిషిని మించి వెళ్లిన రోజు ఏం జరుగుతుందన్న ప్రశ్నకు మాత్రం ఇప్పటికీ స్పష్టమైన సమాధానం లేదు. బహుశా అసలు పోటీ ఏఐతో కాదు.. మనిషి తన సృష్టిని

## జోర్డాన్‌లోని యూఎస్ బేస్‌పై ఇరాన్ దాడి

# పలు యుద్ధ విమానాల ధ్వంసం

అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరాయి. జోర్డాన్‌లోని అమెరికా వైమానిక స్థావరంపై బుధవారం రాత్రి ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడింది. ఈ దాడిలో పలు అమెరికా యుద్ధ విమానాలు ధ్వంసమైనట్లు సమాచారం. ఈ దాడిలో ఒక ఏ10 థండర్‌బోల్ట్ యుద్ధ విమానం ఎడమ రెక్క పూర్తిగా ధ్వంసమైందని, మరో ఎనిమిది ఎఫ్15 ఫైటర్ జెట్‌లు పాక్షికంగా దెబ్బతిన్నాయని సీబీఎస్ రిపోర్టర్ జెన్నిఫర్ జాకబ్స్ తన 'ఎక్స్' ఖాతాలో వెల్లడించారు. ఇరాన్ దాడులను తిప్పికొట్టే క్రమంలో జోర్డాన్‌లోని అమెరికా దళాలు 30కి పైగా ప్యాట్రియాట్ క్షిపణులను ప్రయోగించాయి. ఇటీవల అమెరికా యుద్ధ నౌకలను ఇరాన్ లక్ష్యంగా చేసుకోగా, అందుకు ప్రతీకారంగా అమెరికా ఐదు ఇరాన్ ఆయిల్ ట్యాంకర్లను ధ్వంసం చేసింది. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలోనే తాజా దాడి చోటుచేసుకుంది. తాము ఎనిమిది అమెరికా ఆయిల్ ట్యాంకర్లు, రెండు యుద్ధ నౌకలతో పాటు జోర్డాన్‌లోని మువఫఖ్ సల్తీ వైమానిక స్థావరంపై దాడి చేసినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ప్రకటించింది. ఈ పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. నవంబర్‌లో జరగనున్న ఎన్నికల తర్వాత ఇరాన్‌తో వివాదం సద్దుమణగవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. యుద్ధాన్ని సుదీర్ఘకాలం కొనసాగించే సామర్థ్యం ఇరాన్‌కు లేదని, కేవలం అమెరికా ఎన్నికలను ప్రభావితం చేయడానికే ఆ దేశం ఇటువంటి చర్యలకు పాల్పడుతోందని బుధవారం మీడియాతో మాట్లాడుతూ ట్రంప్ వ్యాఖ్యానించారు.

## చైనా షిప్‌యార్డ్‌లో అగ్నిప్రమాదం.. కార్గో నౌకలో 20 మంది మృతి

చైనాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. కింగ్‌డావో బీహై షిప్‌యార్డ్‌లో మరమ్మతుల నిమిత్తం నిలిపి ఉంచిన ఒక కార్గో నౌకలో భారీగా మంటలు చెలరేగాయి. ఈ విషాద ఘటనలో సుమారు 20 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు గల్లంతయ్యారు. లైబీరియా జెండాతో ఉన్న 'ఓషన్ మెలోడీ' అనే కార్గో నౌకను మరమ్మతుల కోసం షిప్‌యార్డ్‌కు తీసుకువచ్చారు. పనులు జరుగుతున్న క్రమంలో అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. ప్రమాదం సంభవించిన సమయంలో నౌకలో మొత్తం 42 మంది సిబ్బంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంపై చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, ప్రమాదానికి గల కారణాలపై తక్షణమే దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నౌకలో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడం, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ప్రధాని లీ కియాంగ్ స్పష్టం చేశారు. చైనా స్టేట్ షిప్‌బిల్డింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడిచే కింగ్‌డావో బీహై షిప్‌యార్డ్, ఆ దేశంలోని అతిపెద్ద నౌకా నిర్మాణ, మరమ్మతు కేంద్రాలలో ఒకటిగా గుర్తింపు పొందింది.

## లాల్ మందిర్‌ను టార్గెట్ చేశారు..

# ఎర్రకోట వద్ద పేల్చారు..

దేశ రాజధాని ఢిల్లీని 2025లో కుదిపేసిన ఎర్రకోట సమీపంలోని బాంబు పేలుడు ఘటనలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) సంచలన విషయాలను వెల్లడించింది. ఆ దాడిలో ఎర్రకోట అసలు లక్ష్యం కాదని, తీవ్రవాదులు మరొక ప్రదేశాన్ని టార్గెట్ చేశారని తన చార్జిషీట్‌లో పేర్కొంది. కేవలం ట్రాఫిక్ రద్దీ, కట్టుదిట్టమైన భద్రత కారణంగానే ఉగ్రవాదులు తమ ప్రణాళికను చివరి నిమిషంలో మార్చుకున్నారని తెలిపింది.

**అసలు లక్ష్యం లాల్ మందిర్**

2025 నవంబర్ 10న జరిగిన ఈ ఘటనపై లోతైన దర్యాప్తు జరిపిన ఎన్ఐఏ, కీలక ఆధారాలను కోర్టుకు సమర్పించింది. దాని ప్రకారం, ఉగ్రవాదుల అసలు లక్ష్యం చాందినీ చౌక్‌లోని ప్రసిద్ధ లాల్ మందిర్ (జైన దేవాలయం). పేలుడు పదార్థాలతో నింపిన వాహనాన్ని మొదట అక్కడికే తీసుకెళ్లారు. సాయంత్రం 6:37 గంటల సమయంలో వాహనం డ్రైవర్ లాల్ మందిర్ సమీపంలో వాహనాన్ని నిలిపేందుకు ప్రయత్నించినట్లు సీసీటీవీ ఫుటేజీలో స్పష్టంగా రికార్డయింది. అయితే, ఆ సమయంలో ఆ ప్రాంతంలో విపరీతమైన రద్దీ ఉండటం, పోలీసుల భద్రత ఎక్కువగా ఉండటంతో వారి ప్లాన్ అమలు కాలేదు.

**ఎర్రకోట వద్ద ఆత్మాహుతి దాడి**

అసలు లక్ష్యం వద్ద దాడి సాధ్యపడకపోవడంతో డ్రైవర్ వాహనాన్ని చారిత్రక ఎర్రకోట వైపు మళ్లించాడు. సుమారు 13 నిమిషాల తర్వాత సాయంత్రం 6:50 గంటలకు, ఎర్రకోటలోని గేట్ నంబర్ 4 సమీపంలో వాహనాన్ని పేల్చివేశాడు. ఈ భయానక ఆత్మాహుతి దాడిలో 11 మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోగా, మరో 29 మంది తీవ్రంగా గాయపడ్డారు.

**డీఎన్ఏ ఆధారాలతో గుర్తింపు**

ఘటనా స్థలంలో లభించిన ఫోరెన్సిక్, డీఎన్ఏ ఆధారాలు ఈ కేసు దర్యాప్తులో కీలకంగా మారాయి. ఈ ఆధారాలను విశ్లేషించడం ద్వారా వాహనంలో ఉన్న ఆత్మాహుతి దళ సభ్యుడిని గుర్తించినట్లు ఎన్ఐఏ తన చార్జిషీట్‌లో పొందుపరిచింది. సీసీటీవీ ఫుటేజీ, శాస్త్రీయ ఆధారాలు ఈ ఉగ్రకుట్రను ఛేదించడంలో దర్యాప్తు సంస్థకు ఎంతగానో ఉపయోగపడ్డాయి.

ఈ చార్జిషీట్ ప్రస్తుతం కొనసాగుతున్న విస్తృత దర్యాప్తులో ఒక భాగం మాత్రమేనని, దాడి వెనుక ఉన్న పెద్ద కుట్రను ఛేదించే పనిలో ఉన్నామని అధికారులు తెలిపారు. ఈ ఘటన అనంతరం ఢిల్లీతో పాటు దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో భద్రతను గణనీయంగా కట్టుదిట్టం చేశారు. కేవలం ట్రాఫిక్ కారణంగా ఒక ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెను ప్రమాదం నుంచి బయటపడటం గమనార్హం.

# ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు..సర్వం సిద్ధమన్న ప్రధాని మోదీ

ఈ వారాంతంలో జరగనున్న ప్రతిష్ఠాత్మక బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు దేశ రాజధాని న్యూఢిల్లీ సర్వ సన్నద్ధమైంది. ఈ కీలక కార్యక్రమానికి భారత్ సిద్ధంగా ఉందని, ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ప్రకటించారు. సెప్టెంబర్ 1213 తేదీల్లో జరిగే ఈ 18వ బ్రిక్స్ సదస్సు కోసం ఢిల్లీలోని భారత్ మండపం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈ మేరకు ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా ఒక ప్రత్యేక వీడియోను పంచుకున్నారు. ప్రపంచ నేతలకు స్వాగతం పలికేందుకు సిద్ధమైన భారత్ మండపం వీడియోను షేర్ చేస్తూ, "బ్రిక్స్ 2026కు సర్వం సిద్ధం!" అని ఆయన పేర్కొన్నారు. ఈ సదస్సులో పాల్గొనేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసా, ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ సహా పలువురు సభ్య, భాగస్వామ్య, ఆహ్వానిత దేశాల నేతలు ఢిల్లీకి రానున్నారు. 2026 సంవత్సరానికి బ్రిక్స్ కూటమికి భారత్ అధ్యక్షత వహిస్తోంది. 'సుస్థిరత, ఆవిష్కరణ, సహకారం, పునరుత్థానం కోసం నిర్మాణం' అనే థీమ్‌తో ఈ సదస్సును నిర్వహిస్తోంది. "మానవత్వానికే ప్రథమ ప్రాధాన్యం" అనే ప్రధాని మోదీ దార్శనికతకు అనుగుణంగా ఈ థీమ్‌ను




ఎంచుకున్నారు. అంతర్గత సహకారాన్ని బలోపేతం చేసుకోవడంతో పాటు, పరస్పర ప్రాధాన్యత ఉన్న ప్రపంచ, ప్రాంతీయ అంశాలపై నేతలు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. సదస్సు నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు, ఇతర ఏజెన్సీలతో కలిసి రాజధానిలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. దాదాపు 15,000 మంది పోలీస్ సిబ్బంది, 200 కంపెనీల పారామిలటరీ బలగాలను మోహరించారు. వీవీఐపీల రాకపోకల కారణంగా పలు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని ప్రజలకు ముందుగానే సూచనలు జారీ చేశారు. భారత్ బ్రిక్స్ కూటమికి వ్యవస్థాపక సభ్యదేశం. 2012, 2016, 2021లో కూడా భారత్ అధ్యక్షత వహించింది. ఇప్పుడు నాలుగోసారి ఈ బాధ్యతను స్వీకరించింది. 2026తో బ్రిక్స్ కూటమి ఏర్పడి 20 ఏళ్లు పూర్తి కావడం మరో విశేషం. ఈ ఏడాది జనవరి 1న అధ్యక్ష బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి భారత్ దాదాపు 350కి పైగా సమావేశాలు, ఉన్నత స్థాయి కార్యక్రమాలను నిర్వహించి కూటమి వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేసిందని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

# మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కృషి ఫలితమే

* **చౌటుప్పల్ కోర్టుకు నూతన భవనం మంజూరు:**
* **చౌటుప్పల్ కోర్టు ప్రభుత్వ న్యాయవాది వాకిటి నర్సింహారెడ్డి**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ కోర్టుకు నూతన భవనం మంజూరు.. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కృషి ఫలితమేనని చౌటుప్పల్ కోర్టు ప్రభుత్వ న్యాయవాది వాకిటి నర్సింహారెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఉన్న సమయంలో యాదాద్రి భువనగిరి జిల్లా కోర్టు అడ్మినిస్ట్రేషన్ జడ్జి జస్టిస్ మాధవి దేవిని కలిశానని, చౌటుప్పల్ కోర్టుకు నూతన భవనాలు నిర్మించాలని కోరుతూ వినతి పత్రం అందజేశానన్నారు. ఆ సందర్భంగా అప్పటి జడ్జి మారుతి దేవి చౌటుప్పల్ కోర్టును సందర్శించారని, అదేవిధంగా కోర్టుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారని గుర్తు చేశారు. అనంతరం ప్రస్తుత జిల్లా జడ్జి జయరాజ్ కోర్టు స్థలాన్ని సందర్శించి, నూతన భవన నిర్మాణ ప్రపోజల్ ను హైకోర్టుకు పంపారని తెలిపారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కలిసి, చౌటుప్పల్ కోర్టుకు నూతన భవనం మంజూరు చేయించాలని విన్నవించానన్నారు. వెంటనే స్పందించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముందుచూపుతో వ్యవహరించి చౌటుప్పల్ కోర్టుకు నూతన భవనం మంజూరు చేశారని తెలిపారు. దీంతో చౌటుప్పల్ మండల కేంద్రంలో కోర్టు నిర్మాణానికి అనుమతి లభించిందన్నారు. సర్వే నెంబర్ 50లో ప్రభుత్వం ఇంతకుముందే కేటాయించిన 5ఎకరాల స్థలంలో నూతన భవనం నిర్మాణానికి బుధవారం మంజూరు చేస్తూ, జీవో జారీ చేసిందని తెలిపారు. చౌటుప్పల్ మండల కేంద్రంలో నూతన కోర్టు భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి న్యాయవాదుల తరపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



# ట్రాన్స్‌జెండర్లు చట్టాలను గౌరవిస్తూ గౌరవప్రదమైన జీవనం సాగించాలి

* **నల్గొండ డీఎస్పీ కే. శివరాం రెడ్డి**




ప్రజాస్ఫూర్తి, నల్లగొండ: నల్గొండ పట్టణ పరిధిలోని ట్రాన్స్‌జెండర్లతో నల్గొండ డీఎస్పీ కే. శివరాం రెడ్డి ప్రత్యేక అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ, ఇతరులకు ఇబ్బందులు కలగకుండా గౌరవప్రదంగా జీవించాలని ఈ సందర్భంగా డీఎస్పీ సూచించారు.వ్యాపార సంస్థలు, దుకాణాలు, ఇళ్లు, ట్రాఫిక్ సిగ్నల్స్, పండుగలు, శుభకార్యాలు తదితర సందర్భాల్లో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ బలవంతంగా డబ్బులు డిమాండ్ చేయడం లేదా వసూలు చేయడం చేయరాదని స్పష్టం చేశారు. ఎవరైనా స్వచ్ఛందంగా అందించే సహాయాన్ని మాత్రమే స్వీకరించాలని, డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేయడం, బెదిరించడం, అసభ్యకరంగా ప్రవర్తించడం, ప్రజలను వేధించడం వంటి చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాన్స్‌జెండర్లు కూడా సమాజంలో ఒక భాగమేనని, వారి పట్ల ప్రతి ఒక్కరూ గౌరవభావంతో వ్యవహరించాలని, అదే విధంగా వారు కూడా ప్రజల హక్కులు, స్వేచ్ఛకు భంగం కలగకుండా చట్టబద్ధంగా వ్యవహరించాలని డీఎస్పీ సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.ఈ అవగాహన కార్యక్రమంలో సీఐలు ఆదిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐలు సైదాబాబు, షరీఫ్‌తో పాటు జిల్లాలోని పలువురు ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

# ఆత్మకూర్ (ఎస్) పిహెచ్‌సిలో గర్భిణికి సురక్షిత ప్రసవం

* **మగబిడ్డకు జన్మనిచ్చిన భాగ్యలక్ష్మి**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు విజయవంతంగా ప్రసవం నిర్వహించారు. ఆత్మకూర్ (ఎస్) గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మి (29, రెండవ కాన్పు) అనే మహిళ గురువారం పురిటి నొప్పులతో ఆసుపత్రిలో చేరారు. డ్యూటీ వైద్యాధికారిణి డాక్టర్ రమ్య తన వైద్య సిబ్బందితో కలిసి ఆపరేషన్ లేకుండానే ఆమెకు సురక్షితంగా సాధారణ ప్రసవం చేశారు. భాగ్యలక్ష్మి ఆరోగ్యకరమైన మగబిడ్డకు జన్మనిచ్చారు. ప్రస్తుతం తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారని డాక్టర్ రమ్య తెలిపారు. సకాలంలో స్పందించి మెరుగైన వైద్యసేవలు అందించిన డాక్టర్ రమ్యతో పాటు హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎమ్, ఆశా వర్కర్ల బృందాన్ని కుటుంబ సభ్యులు, స్థానికులు అభినందించారు.
సిబ్బందికి ప్రశంసలు: ఆప్యాయమైన వైద్య సేవలు అందిస్తూ, కాన్పులను విజయవంతం చేస్తున్న డాక్టర్ రమ్య గారిని మరియు ఆసుపత్రి వైద్య సిబ్బందిని ఆత్మకూర్ (ఎస్) ప్రజలు, రోగుల బంధువులు కొనియాడుతున్నారు. ఇందులో డాక్టర్ రమ్య, నర్సింగ్ ఆఫీసర్ మానస, ఎ ఎన్ ఎమ్ లు మహబూబా, ఆత్మకూర్ అన్నపూర్ణ, ఆశా వర్కర్ మాధవి, యాదగిరి, హెల్త్ అసిస్టెంట్ కొండ్లె శ్రీను పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

: **జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



జనగామ, ప్రజాస్ఫూర్తి : చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమ ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతు ల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువా రం నిర్వహించిన చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు తెలంగాణ మహిళా కమిషన్ సభ్యురా లు,ఐలమ్మ మనుమరాలు చిట్యాల శ్వేత పాల్గొన్నారు. ఐలమ్మ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాలలు వే సి ఘనంగా నివాళులర్పించారు.

# ప్రజా వ్యతిరేక విధానాల పై ఐక్య పోరాటాలు సాగించాలి

: **సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్**




జనగామ, ప్రజాస్ఫూర్తి : వీర తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్య మాలను మరింత బలోపేతం చేయాల ని సీపీఎం జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా గు రువారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వ ర్యంలో ఆమెకు ఘనంగా నివాళుల ర్పించారు.ఈ కార్యక్రమంలో సీ పీఎం నాయకులు సాంబరాజు యాదగి రి, ఇర్రి అహల్య, బొట్ల శేఖర్, బూడిది గోపి, ఎండీ అజారుద్దీన్, పుతుకునూరి ఉపేందర్, కళ్యాణం లింగం, పల్లెర్ల లలి త, గంగరబోయి మల్లేష్, రాజ్ మాదాసి సుధాకర్, సుగుణ, పాము కుంట్ల రేణు క, రమాదేవి, పాము బిక్షపతి, సిద్ధిరాల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగుల పక్షాన పోరాటాన్ని అరెస్టులతో ఆపలేరు

* **బీ ఆర్ ఎస్ వీ ముస్తాబాద్ మండల అధ్యక్షులు ఎండీ నవాజ్**




ప్రజాస్ఫూర్తి,ముస్తాబాద్: నిరుద్యోగులకు అండగా నిలుస్తున్నామన్న అక్కసుతోనే రాష్ట్ర ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడుతోందని బీ ఆర్ ఎస్ వీ ముస్తాబాద్ మండల అధ్యక్షులు ఎండీ నవాజ్ ఒక ప్రకటనలో మండిపడ్డారు. నిరుద్యోగుల రాష్ట్ర జేఏసీ పిలుపులో భాగంగా వారికి మద్దతుగా నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న తనతో పాటు ప్రశాంత్‌ను ముస్తాబాద్ పోలీసులు గురువారం ఉదయం అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అరెస్టులతో తమ ఉద్యమాన్ని ఎప్పటికీ ఆపలేరని, నిరుద్యోగుల హక్కుల సాధన కోసం భవిష్యత్తులోనూ పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# వల్లభ డెయిరీ పార్లర్ ప్రారంభం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందించి వారి మన్ననలు పొందాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షులు ఎండీ అంజద్ అలీ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తాళ్లగడ్డలో నిర్వాహకులు ఎండీ రఫీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వల్లభ డెయిరీ పార్లర్ నూతన ఫ్రాంచైజీని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వల్లభ డెయిరీ వారి ఉత్పత్తులను ప్రజలు ఆదరించి, వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బైరు వెంకన్న గౌడ్,రియాజుద్దీన్, ముంతాజ్ ఖాన్, మొయినుద్దీన్, కంపెనీ సిబ్బంది సలీమ్,నజీర్, కిరణ్,లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన సదస్సు



వలిగొండ, ప్రజాస్ఫూర్తి: వలిగొండ మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పోక్సో , మాదకద్రవ్యాల దుష్పరిమానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగాస్థానిక ఎస్సై శ్రీకాంత్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు తెలియజేశారు డ్రగ్స్ విద్యార్థుల యొక్క జీవితాలను నాశనం చేస్తాయని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, మైనర్లు బైక్ నడపరాదని సూచించారు. విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు తమ పిల్లలకు బైక్ ఇవ్వకూడదని, అలా ఇచ్చినచో మీరు కూడా బాధ్యులవుతారని హెచ్చరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం ఇస్తున్నటువంటి ప్రోత్సకాలను ఉపయోగించుకుంటూ చదువుపై, క్రీడలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పరశురాములు, అనీఫ్ వెంకటాచారి,మురళి, సురేష్, స్వప్న, సైదా రవి, కృష్ణ, గణేష్ కుమార్, గోపీనాథ్,మృదుల,ఆనంద్,హాజీ వేగం లలిత, సుకన్య విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు




వలిగొండ , ప్రజాస్ఫూర్తి : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శమని బీసీ సంఘం మండల అధ్యక్షుడు సాయిని యాదగిరి అన్నారు. గురువారం వలిగొండ మండల కేంద్రంలోచాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల ఫోరం నాయకులు , వివిధ కుల సంఘాల నాయకులతో కలిసి పట్టణ కేంద్రంలోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న, ఉద్యమకారుల సంఘం నాయకులు క్రిస్టఫర్, మాజీ ఉపసర్పంచ్ పబ్బు సురేందర్, ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్, బోడిగె సుదర్శన్, ఎలిమినేటి సత్యనారాయణ, మైసొల్ల లక్ష్మీనర్సు, మైసొల్లయాదగిరి, మత్స్యగిరిలక్ష్మయ్య, ఎండి కాసిం, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు ఉపాధ్యాయులకూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇవ్వాలి



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి) : ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకూ ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందించాలని సోషల్ జస్టిస్ ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆకుల సుభాష్ ముదిరాజ్ కోరారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గురువారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని తేజస్విని జూనియర్ కళాశాలలో ఫోరం ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుభాష్ ముదిరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రస్తుతం ప్రభుత్వ ఉపాధ్యాయులకే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందిస్తోందన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయుల సేవలను కూడా గుర్తించి వారికి అవార్డులు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోషల్ జస్టిస్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఏషాబోయిన సాంబయ్య యాదవ్, టీఆర్‌పీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తూరి రవీందర్, పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి ప్రభాకర్, న్యాయవాది వెంపటి భువనసుందర్, జిల్లా సలహాదారు రొంటాల లింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి ముత్తోజు వేణాచారి, ఉపాధ్యక్షులు బత్తుల శ్రీధర్, అప్పల శ్రీనివాస్, లాట్ట రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యక్రమం జయప్రదం చేయాలి



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: ఈనెల 13వ తేదీన హైదరాబాదులో ఉప్పల్ బగాయత్ లో జరుగుతున్న ఆర్యవైశ్య భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటున్న సందర్భంగా ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, పట్టణ ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో హైదరాబాదు కు తరలి రావాలని , సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు అన్నారు. గురువారం స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో జరిగిన ఆర్యవైశ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య భవనాల నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి స్థానిక ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని అన్నారు. ఆదివారం ఉదయం 6 గంటలకు వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం వద్దకు చేరుకోవాలని , అక్కడ నుంచి కార్లు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. కాబట్టి ఆర్యవైశ్యులు ఆదివారం ఉదయం 6:00 వరకు స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం వద్దకు చేరుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండారు రాజా, జిల్లా కోశాధికారి చల్లాలక్ష్మీకాంత్, పట్టణ ప్రధాన కార్యదర్శి బికుమల్ల కృష్ణ, కోశాధికారి ఉప్పల శ్రవణ్ కుమార్, నాయకులు బొమ్మిడి లక్ష్మినారాయణ, తప్సి గాంధీ, వెంపటి సురేష్, రాచకొండ శ్రీనివాస్, దేవరశెట్టి సత్యనారాయణ, బ్రహ్మాండపల్లి మురళి, మంచాల రంగయ్య, కలకోట లక్ష్మయ్య, గుండా శ్రీధర్, మిట్టపల్లి రమేష్ , మిట్టపల్లి శ్రీదేవి, తోట కమల , తెల్లాకుల శ్రీదేవి, సోమ వెంకన్న, సుమన్ వెంకన్న, సోమ ప్రవీణ్ ,తల్లాడ మోహన్, కక్కిరేణి ప్రసాద్ , గుడిపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిషేధిత టేస్టింగ్ సాల్ట్ వాడితే లైసెన్స్ రద్దు

: **ఫుడ్ సేఫ్టీ అధికారులు.**

* **జిల్లా కేంద్రంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు**

జనగామ, ప్రజాస్ఫూర్తి : పట్టణంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వ హించారు. అధికారి వినీల్ ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో కొన్ని హోటళ్లలో ని షేధిత టేస్టింగ్ సాల్ట్ వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ఫస్సై అనుమతి లేని టే స్టింగ్ సాల్ట్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ విని యోగించరాదని అధికారులు హోటల్ యజమానులను హెచ్చరించారు. మరో సారి తనిఖీల్లో వినియోగం గుర్తిస్తే హో టల్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# సుగుణాకర్ గౌడ్ సస్పెన్షన్ ఎత్తి వేయాలి

: **బీఆర్ఎస్ నాయకులు**

* **లేనిపక్షంలో కౌన్సిలర్లతో కలిసి ఆందోళన.**




జనగామ, ప్రజాస్ఫూర్తి : సోషల్ మీడి యాలో వచ్చిన సందేశాలను ఆధారం గా చేసుకుని 18వ వార్డు కౌన్సిలర్ సు గుణాకర్ గౌడ్‌ను ఎలాంటి నోటీసు, వి చారణ లేకుండా సస్పెండ్ చేయడాన్ని బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు తీవ్రంగా ఖం డించారు. జనగామ ఎమ్మెల్యే కార్యాల యంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ప్రేమ లత రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావే శంలో వారు మాట్లాడారు. కౌన్సిల్ హాల్ లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరి స్తే చర్యలు తీసుకోవచ్చని, కానీ సోషల్ మీడియా పోస్టులను సాకుగా చూపి ఏ కపక్షంగా సస్పెండ్ చేయడం అప్రజా స్వామికమని అన్నారు. ప్రజలచే ఎన్ను కోబడిన కౌన్సిలర్‌పై కక్షపూరితంగా వ్య వహరించడం సరికాదని, వెంటనే సస్పె న్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశా రు. లేనిపక్షంలో కౌన్సిలర్లందరితో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించా రు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ భూష పర్వతాలు,పట్టణ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, పోకల జమున, కౌన్సిలర్లు సుగు ణాకర్ గౌడ్, పానుగంటి సువార్త, మా మిడాల రాజు తదితరులు పాల్గొన్నా రు.

# నిర్దేశిత గడువులోగా రీసర్వే పనులు పూర్తి చేయాలి

* **అదనపు కలెక్టర్ బెన్షా లోమ్.**

జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లాలో చేప డుతున్న కాడాస్ట్రల్ రీసర్వే పనులను నిర్దేశిత గడువులోగా ఎలాంటి పొరపా ట్లకు తావులేకుండా అత్యంత ఖచ్చిత త్వంతో పూర్తి చేయాలని అదనపు కలె క్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ అధికారుల ను ఆదేశించారు.గురువారం దేవరుప్పు ల మండలం చౌడూర్ గ్రామంలో కొనసా గుతున్న రీసర్వే పనులను ఆకస్మికం గా పరిశీలించారు. డీజీపీఎస్ రోవర్‌తో నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియను పరిశీలించిన ఆయన.. సర్వే బృందాల రోజువారీ పనితీరు,పురోగతి,ప్రతిరోజూ పూర్తి చేస్తున్న విస్తీర్ణంపై వివరాలు తెలు సుకున్నారు. భూ రికార్డులను శాస్త్రీ యంగా, పారదర్శకంగా రూపొందించ డంలో కాడాస్ట్రల్ రీసర్వే కీలకమని పే ర్కొంటూ, పనులను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు.




పరిశీలనలో డీఐ మహేందర్, ఎల్ఎస్ఎస్‌లు, సం బంధిత అధికారులు పాల్గొన్నారు.

## జనగామ రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా ధర్మపురి రామాచారి



జనగామ, ప్రజాస్ఫూర్తి : పట్టణ రేషన్ డీలర్ల సంఘం నూతన అధ్యక్షుడిగా ధర్మపురి రామాచారి ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. సెప్టెంబర్ 9న నాయకులు ఊ టుకూరు మురళీధర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో పట్టణంలోని రేషన్ డీలర్లు పాల్గొని నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎం.ప్రవీణ్,ఉపాధ్యక్షురాలిగా బోట్ల సుమతి, కోశా ధికారిగా జి.శ్రీలత,సహాయ కార్యదర్శి గా దాసి స్వరూప వెంకటేశ్వర్లు,గౌరవ అధ్యక్షులుగా చెంచారపు బుచ్చిరెడ్డి, ముఖ్య సలహాదారులుగా ఆకుల బాల నిల ను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను పట్టణ రేషన్ డీలర్లు అభినందించారు.

## ఘనంగాచాకలి ఐలమ్మ వర్ధంతి



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ :నల్గొండ పట్టణ కేంద్రంలో సాగర్ రోడ్ లో బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి బిసి సంక్షేమ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మిర్యాల యాదగిరి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు చీర పంకజ్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దుదుకు లక్ష్మి నారాయణ, ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే రాజు, బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి పగల కృష్ణ ,యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## గడ్డిపల్లి మోడల్ స్కూల్లో వినాయక చవితి వేడుకలు




గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి మోడల్ స్కూల్లో వినాయక చవితి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో విద్యార్థులు స్వయంగా మట్టి గణపతి విగ్రహాలను తయారు చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ప్రసన్నకుమారి మాట్లాడుతూ ఆది గణపతిని భక్తిశ్రద్ధలతో పూజించడం ద్వారా సకల శుభాలు కలుగుతాయని, విద్యార్థులకు సంకల్పసిద్ధి, మంచి బుద్ధి కలగాలని ఆకాంక్షించారు. మట్టి విగ్రహాల వినియోగం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సతీష్‌కుమార్, శైలజ, వెంకటేశ్వర్లు, వీరభద్రం, విష్ణువర్ధన్, డాక్టర్ కందుల శివకృష్ణ, డాక్టర్ శ్రవణ్ కుమార్, దాష్మా, శాంతి ప్రియ, శేఖర్, భూలక్ష్మి, నవాబ్, ప్రమీల, పార్వతి తదితరులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## సేవకే అంకితం సమస్య పరిష్కారమే లక్ష్యం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమితులైన గుగులోతు కిషన్ నాయక్ కు సొంత గ్రామం కొత్తూరు(సి)లో ఘన సత్కారం లభించింది.గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉప సర్పంచ్ పగడాల క్రిష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా కిషన్ నాయక్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వెంటనే సంబంధిత అధికారులు,జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, జీపీఓ వీరస్వామి, ప్రధానోపాధ్యాయులు మనోహర్, ఉపాధ్యాయులు వీరన్న,రేషన్ డీలర్ సత్యనారాయణ, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు వేణు, ఆశా కార్యకర్త శైలజ, అంగన్ వాడీ టీచర్ ద్రౌపతి,మహిళా ప్రధాన కార్యదర్శి మేఘన,వార్డు సభ్యులు సుజాత, లక్ష్మీనారాయణ, బాబు,డా"యాఖుబ్, సంపత్,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

**టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు**



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : కొత్తగూడెంలోని రైల్వే స్టేషన్ వద్ద తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి టిపిసిసి జనరల్ సెక్రెటరీ నాగ సీతారాములు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు, కార్పొరేటర్లు, వివిధ సంఘాల నాయకులు, పట్టణ ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలి

* **అదనపు కలెక్టర్ వేణుగోపాల్**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, ప్రమాదాలకు గల కారణాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా విశ్లేషించి, ప్రమాదాల పునరావృతిని అరికట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, అధికారులు, వాహనదారులు, ప్రజలు సమష్టిగా బాధ్యతాయుతంగా వ్యవహరించినప్పుడే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించగలమని ఆయన అన్నారు. ఐడీఓసీ కార్యాలయం అదనపు కలెక్టర్ ఛాంబర్ నందు నిర్వహించిన జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశంలో జిల్లాలో నమోదైన రోడ్డు ప్రమాదాలు, వాటికి దారితీస్తున్న కారణాలు, ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలు, బ్లాక్ స్పాట్ల వద్ద చేపట్టాల్సిన భద్రతా చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో ఇప్పటివరకు 42 బ్లాక్ స్పాట్లను గుర్తించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో గతంలో జరిగిన ప్రమాదాలకు గల కారణాలను విశ్లేషించి, అవసరమైన ఇంజినీరింగ్, రహదారి భద్రతా చర్యలను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని సూచించారు. జిల్లాలో జనవరి నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు మొత్తం 349 రోడ్డు ప్రమాదాలు నమోదై 164 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వివరించారు. రహదారులపై పశువుల సంచారం, ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రమాదాలకు కారణమవుతున్నందున పశువులను రహదారులపైకి వదిలే యజమానులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రవాణా అధికారి వెంకటరమణ, జిల్లా పంచాయతీ అధికారి అనూష, జిల్లా ఇంటర్మీడియట్ శాఖాధికారి వెంకటేశ్వర్లు, ఆర్అండ్‌బీ ఈఈ నాగేశ్వరరావు, కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐ గడ్డం ప్రవీణ్ కుమార్, ఐఆర్ఏడీ జిల్లా మేనేజర్ బాలాజీ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

* **బిజెపి ముస్తాబాద్ మండల అధ్యక్షులు సొల్ల క్రాంతికుమార్**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బిజెపి ముస్తాబాద్ మండల అధ్యక్షులు సొల్ల క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. బిజెపి ముస్తాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం తహసిల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నిజాం రజాకార్ల నిరంకుశ పాలన నుండి తెలంగాణ ప్రాంతానికి విముక్తి లభించిన రోజు సెప్టెంబర్ 17 అని గుర్తు చేశారు. అమరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో జాతీయ జెండాను అధికారికంగా ఎగురవేసి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఎదునూరి గోపికృష్ణ, జిల్లా కార్యదర్శి మీసా సంజీవ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ మెరుగు అంజాగౌడ్, ఆవునూర్ సర్పంచ్ నక్కదాసరి రవీందర్, ఉప సర్పంచ్‌లు కోలా కృష్ణా, దగ్గు నవీన్, ఉపాధ్యక్షులు తిరుపతి, చికోటి మహేష్, కాసోడి రమేష్, చిట్టినేని శ్రీనివాస్ రావు, కుడుకల జనార్ధన్, మహేష్, శక్తి కేంద్ర ఇంచార్జీలు గూడా బాల్ రెడ్డి, కట్కం మహేష్, మీస స్వామి, కాసరపు రవి, మామిండ్ల బిక్షపతి, హర్షవర్ధన్, యాదగిరి, శ్యామ్, ప్రణవ్, సాయి తదితర బీజేపీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు ఆధార్ సేవలు మరింత చేరువ

* **నూతన ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అంకిత్**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలోని సింగరేణి మెయిన్ హాస్పిటల్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం కేంద్రంలోని వివిధ విభాగాలను పరిశీలించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన సదుపాయాలు, ఆధార్ సేవల నిర్వహణకు ఏర్పాటు చేసిన మౌలిక వసతులు, సాంకేతిక పరికరాలు తదితర వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, రోజువారీగా ఎంతమందికి సేవలు అందించగల సామర్థ్యం ఉంది, ప్రజలకు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ రాష్ట్ర యుఐడిఏఐ రీజినల్ కార్యాలయం, హైదరాబాద్ ప్రాజెక్ట్ మేనేజర్ నరేష్ చంద్ర, బీఎల్ఎస్ ఇంటర్నేషనల్ సర్వీస్ లిమిటెడ్ రీజినల్ మేనేజర్ శ్రీనివాస్, భద్రాద్రి కొత్తగూడెం ఆధార్ సేవా కేంద్రం ఆపరేషనల్ మేనేజర్ వంశీ, కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య, ఇ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు, టిఎస్‌టిఎస్ జిల్లా మేనేజర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగ గా పొలాల అమావాస్య వేడుకలు



ప్రజా స్ఫూర్తి, భైంసా: నిర్మల్ జిల్లా భైంసా మండలం కేంద్రంలోని దేగాం గ్రామం లో బసవన్నల ఊరేగింపు గురువారం అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులు వ్యవసాయ పనుల్లో నిరంతరం రైతన్నలతో కలిసి కష్టపడుతూ, మనకు అన్నం పెట్టే బసవన్నల రుణం తీర్చుకోవాలనే కృతజ్ఞతా భావంతో రైతులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగే 'పొలాల అమావాస్య' ఎడ్ల పండుగ సంవత్సరం పొడవునా రైతన్నకు తోడుగా నిలిచి, పొలాన్ని దున్ని, పంట పండించడంలో కీలక పాత్ర పోషించే ఎడ్లను ఈ పర్వదినాన శుభ్రంగా కడిగి, వర్ణశోభితంగా అలంకరిస్తారు. అనంతరం వాటికి ప్రత్యేక పూజలు చేసినైవేద్యాలు సమర్పించి ఘనంగా గౌరవించడం మన గ్రామీణ సంస్కృతిలో ఒక గొప్ప సంప్రదాయం. రైతు కష్టానికి ప్రకృతి సహకారం తోడై, ప్రతి ఇంటా సిరి సంపదలు, సుఖ సంతోషాలు, ఆరోగ్యం, ఆనందం నిండాలని రైతులు ఆ భగవంతుణ్ణి వేడుకుంటారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ సిరం సుష్మ రెడ్డి సిందే సత్య నారాయణ రావ్ పాటిల్, సిందే ముకేష్ పటేల్,ఉప సర్పంచ్ బాలేకర్ శివాజి చంద్రకాంత్ పాటిల్ విడిసి చేర్మెన్ నాని.లక్ష్మన్ వార్డ్ సభ్యులు , గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి పై చర్యలు తీసుకోవాలి

: **కౌన్సిలర్లు**



జనగామ, ప్రజాస్ఫూర్తి : దళిత, మైనార్టీ కౌన్సిలర్ల పట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ క డకంచి బాలమణి అనుచితంగా, అవ మానకరంగా వ్యవహరించారని ఆరోపి స్తూ కౌన్సిలర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రజా సమస్యల పై మాట్లాడేం దుకు వెళ్లిన తమను అవమానకరంగా మాట్లాడారని వారు ఆవేదన వ్యక్తం చే శారు. గతంలోనూ పలుమార్లు తమ ప ట్ల ఇదే విధంగా వివక్ష చూపారని ఆరో పించిన కౌన్సిలర్లు, ప్రజలచే ఎన్నికైన ప్ర జాప్రతినిధులను అవమానించడం సరి కాదన్నారు. కౌన్సిలర్లు పానుగంటి సు వార్త,మంజుల,సాజిత్,పాతిమా సమద్ గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీ ఐకి ఫిర్యాదు చేసి,ఘటనపై సమగ్ర వి చారణ జరిపి చైర్‌పర్సన్ పై చట్టపరమై న చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై సీడీఎంఏ,తెలంగాణ మహిళా కమిషన్, ఎస్సీ ఎస్టీ కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేస్తామని తెలిపారు. దళిత, మైనార్టీ ప్రజాప్రతినిధుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఘటనలను సహించబోమని, పునరావృతం కాకుండా చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం లో బీఆర్ఎస్ నాయకులు బల్దే సిద్ధిలిం గం, మల్లిగారి రాజు,తిప్పరపు విజయ్, ఉల్లెంగుల సందీప్,తిరుమల్ రెడ్డి,గుర్రం నాగరాజు, సలీమ్, గులామ్, ఇరుగు సిద్ధులు, జానీ, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

## షాద్ నగర్ లో చాకలి ఐలమ్మ కు ఘన నివాళి



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా పట్టణంలో రజక సంఘం ఆధ్వర్యంలో జరిగిన వర్ధంతి కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మకు పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ కన్వీనర్ రఘు నాయక్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు వెంకట్ రాంరెడ్డి, రజక సంఘం అధ్యక్షుడు నందిగామ రాంచందర్, సీనియర్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, దంగు శ్రీనివాస్ యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, అన్మగల్ల రమేష్, జాకారం చంద్రశేఖర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ పాల్గొన్నారు. అలాగే కౌన్సిలర్లు పెంటయ్య, రాజు నాయక్, బచ్చలి నరేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం, ఎస్సీ విభాగం నేత జాంగారి రవి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు వావిలాల సుజీవన్, సయ్యద్ ఖదీర్, జేఏసీ నేతలు జనార్ధన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరణాకర్, నక్క బాలరాజు, రాము, లింగారెడ్డిగూడ అశోక్, జామల్‌పూర్ చందూలాల్, గోధ మాధవులు యాదవ్, ముబారక్, సాదక్, జేపీ జయప్రకాశ్, సింగాపగా అనిల్ కుమార్, రవితేజ చిన్న, తంగేడ్‌పల్లి శంకర్, డాకం మనీష్, షర్ఫొద్దిన్, నిరటి వాసు, మంగ అశోక్, మేకల వెంకటేష్, శేఖర్, కృష్ణ, మట్ట వెంకటేష్, రాజు పాల్గొన్నారు. రజక సంఘం నాయకులు చించేడ్ అనంతం, విట్యాల పెంటయ్య, శేఖర్, శివ, శ్రీధర్, దేవగిరి కృష్ణతో పాటు పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుపై ప్రత్యేక దృష్టి

**: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



జనగామ, ప్రజాస్ఫూర్తి : ఉద్యాన, వ్యవ సాయ, గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాల లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధి కారులను ఆదేశించారు. గురువారం స మీకృత కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉద్యాన శాఖ అధికారులతో ని ర్వహించిన సమీక్షలో పలు సూచనలు చేశారు.జిల్లాలో 2,000 ఎకరాల్లో ఆయి ల్‌పామ్ సాగు లక్ష్యానికి ఇప్పట వరకు 523 ఎకరాల్లో ప్లాంటేషన్ పూర్తయింద ని, వారం రోజుల్లో అదనంగా 250 ఎక రాల లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశిం చారు. రైతులకు నాణ్యమైన మొక్కలు అందించేందుకు ఆయిల్‌పామ్ నర్సరీ ఏర్పాటు చేయాలని సూచించారు. డ్రి ప్,స్ప్రింక్లర్ వ్యవస్థల విస్తరణతో పాటు డీలర్‌షిప్‌లను స్వయం సహాయక సం ఘాలకు అందించేలా చర్యలు తీసుకో వాలన్నారు. గ్రామ సభల ద్వారా అర్హు లైన, ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతు లను గుర్తించి పథకాల ప్రయోజనాలు అందించాలని తెలిపారు. సమావేశంలో డీఏఓ అంబికా సోనీ, ఉద్యానవన అధికారి నర్సయ్య, అదనపు డీఆర్డీఓ సూరి తదితరులు పాల్గొన్నారు.

## చిన్న సమస్యకే హైదరాబాద్ బాట పేదలకు భారం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి :జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రి ఎంత పెద్దదైనా పక్షవాతం బాధితులకు ప్రత్యేక వైద్య సేవలు లేకపోవడం పేదలకు భారంగా మారింది. కొద్దిపాటి పక్షవాతం వచ్చినా,చిన్న న్యూరో సమస్య ఉన్నా వెంటనే గాంధీ, నిమ్స్ కు రిఫర్ చేస్తున్నారు.దీంతో పేద కుటుంబాలు హైదరాబాద్ వెళ్లి 10 రోజులు ఉండి వైద్యం చేయించుకోవడం, ప్రయాణ,భోజన ఖర్చులు భరించలేక ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో సిటీ స్కాన్, ఎంఆర్ఐ వంటి పరీక్షలు అందుబాటులో ఉన్నా న్యూరో డాక్టర్ లేకపోవడం,ప్రత్యేక బెడ్స్ లేకపోవడం వల్లే చిన్న కేసులను కూడా హైదరాబాద్ కు పంపాల్సి వస్తోంది.తీవ్ర కేసులను హైదరాబాద్ కు పంపడం తప్పనిసరి కావచ్చు కానీ,ప్రాథమిక దశలో ఉన్న వారికి జిల్లా ఆసుపత్రిలోనే చికిత్స అందిస్తే పేదలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని ప్రజలు కోరుతున్నారు. వారానికి కనీసం ఒక రోజైనా న్యూరో వైద్యుడిని అందుబాటులో ఉంచి,పక్షవాత బాధితులకు ప్రత్యేక బెడ్స్ కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# దళితులను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి




ప్రజాస్ఫూర్తి ,జన్నారం:నిర్మల్ డిసిసి అధ్యక్షులు , ఖానాపూర్ నియోజకవర్గం శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు జన్నారం పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ వద్దకు దళితులు వచ్చారని వారు వచ్చిన ప్రదేశాలను పసుపు నీళ్ళతో శుద్ధి చేయాలని బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆదేశాలతో శుద్ధి చేశామని. దళితులను అవమానించేలా మాట్లాడిన బిఆర్ఎస్ మహిళా నాయకురాలు పావని గౌడ్, సునితారావులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జన్నారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అజ్మీర నందు నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు గురువారం రోజున జన్నారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఎవరైనా వ్యవహరిస్తే ప్రభుత్వం, పోలీసులు చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు బాధ్యులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇసాక్, ఏఎంసీ చైర్మన్ లక్ష్మీనారాయణ, రియాజుద్దీన్, మేకల మాణిక్యం, దూమల్ల రమేష్, రజాక్, దాముఖ కరుణాకర్, మౌలానా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ ఎస్ యు ఐ జిల్లా

# అధ్యక్షునిగా సోహైల్ షా



ప్రజాస్ఫూర్తి , జన్నారం: జన్నారం మండలానికి చెందిన యువ నాయకుడు సోహైల్ షా ను ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్ష పదవి వరించింది గత కొన్ని సంవత్సరాలుగా ఎన్ ఎస్ యు ఐ లో విద్యార్థులకు ఎల్లవేళలా చేదోడు వాదోడుగా ఉండటమే కాకుండా అనేకమైనటువంటి విద్యార్థుల సమస్యల తీర్చడంలో తనకైన ముద్ర వేసుకున్నాడు కాంగ్రెస్ పార్టీ అనుసంధానమైన విద్యార్థి విభాగంలో జిల్లా అధ్యక్ష పదవి అనేది అతి కీలకమైన పదవుల్లో ఒకటి అని ఎన్ ఎస్ యు ఐ జాతీయ అధ్యక్షులు వినోద్ జకర్ , ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ స్వామి తెలిపారు. అదేవిధంగా తనకు ఎల్లవేళలా సహకరించినటువంటి జాతీయ మరియు రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ నాయకులకు ముఖ్యంగా మాజీ ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రస్తుత తెలంగాణ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ బలమూరి వెంకట్ కి సోహైల్ షా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ , ఎన్ ఎస్ యు ఐ బలోపేతానికి జిల్లా నేతల సహాయ సహకారాలతో మరేంతో కృషి చేస్తానని అన్నారు.

# మట్టి గణపతులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

*** జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు**




ప్రజా స్ఫూర్తి, భైంసా : మట్టి గణపతులు పూజించి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు అన్నారు. కలెక్టరేట్ లో గురువారం అధికారులకు, సిబ్బందికి అదనపు కలెక్టర్ ఉచిత మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మంచి మార్పు మన నుంచే ప్రారంభం కావాలని అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు, కృత్రిమ రంగుల వల్ల పర్యావరణానికి ఎంతో హాని కలుగుతుందని, ప్రతి ఒక్కరూ మట్టితో చేసిన విగ్రహాలనే పూజించాలని అన్నారు. పండుగలన్ని సాంప్రదాయ పద్ధతుల్లో పర్యావరణ హితంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఏళ్లనాటి కలకు త్వరలోనే నిజరూపం



బయ్యారం, మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : బయ్యారం మండలం, కాచనపల్లి కోయగూడెం గ్రామాల మధ్య ప్రవహిస్తున్న పది పంపుల చింతరేవు వాగుపై వంతెన నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి.ఈ వాగుపై వంతెన లేక రైతులు,గ్రామ ప్రజలు చాలా ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు.ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య సూచనల మేరకు బుధవారం నీటిపారుదల శాఖ ఉన్నత అధికారులు వాగు వద్దకు వచ్చి స్థలాన్ని పరిశీలించారు. నాలుగు కోట్ల రూపాయలతో నిర్మించనున్న వంతెన పొడవు,వెడల్పు, ఎత్తు,నీటి మట్టం ఎంత ఉండాలనే అంశాలపై అంచనా వేశారు.మట్టి పరీక్షలు చేసి త్వరలోనే పనులు మొదలు పెడతామని గ్రామస్తులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెసు నాయకులు పర్షిక రాజు,షేక్ యూసఫ్,బానోతు రాంబాబు,నునావత్ కిషన్,నునావత్ సక్రు, ఇర్ప పొటయ్య, గ్రామ పెద్దలు, రైతులు,నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని... వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశం మందిరంలో గురువారం వర్ధంతి కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు,రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి వివిధ శాఖల అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి సుబ్బారెడ్డి వివిధ కుల సంఘాల నాయకులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అమ్మేశా అనుకుంటే చిక్కుల్లో పడ్డట్టే!



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: వాహనం అమ్మిన తర్వాత ఆర్టీఏ రికార్డుల్లో యాజమాన్య బదిలీ చేయకుంటే చట్టపరమైన చిక్కులు తప్పవని జిల్లా రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్ హెచ్చరించారు.వాహనం అమ్మి తెల్లకాగితంపై అగ్రిమెంట్ చేసుకుంటే సరిపోదని,ఆర్టీఏ కార్యాలయంలో బదిలీ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు.గౌతమ్ అనే వ్యక్తి ఫైనాన్స్ పై కొన్న ఆటోను ఈఎంఐలు కట్టలేక మరొకరికి అమ్మాడు. రికార్డుల్లో మాత్రం అతని పేరే ఉంది. ఆ ఆటోలో గంజాయి తరలిస్తూ భద్రాచలంలో పట్టుబడటంతో పాత యజమాని కేసులో ఇరుక్కున్నాడు. ఫైనాన్స్ సంస్థ కూడా ఈఎంఐల కోసం ఒత్తిడి తెచ్చింది.అందుకే వాహనం అమ్మిన ప్రతి ఒక్కరూ కొత్త యజమాని పేరు రికార్డుల్లో నమోదైందో లేదో నిర్ధారించుకోవాలని అధికారి సూచించారు.

# మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

*** జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**




ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దామని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. గురువారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీడీవి శ్రీనివాసరావు, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, మెదక్ ఆర్డీవో రమాదేవి, తూప్రాన్ ఆర్డీవో బావయ్య లతో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లాలో వేడుకలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు సమన్వయంతో పని చేయాలని అన్నారు.వినాయక చవితి వేడుకల సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా వేడుకలను నిర్వహించాలని తెలిపారు. అనంతరం జిల్లా అధికారులకు మట్టి వినాయక ప్రతిమలు అందించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ,రెవిన్యూ గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ , విద్యుత్ , ఫైర్ , ఆర్ అండ్ బి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వివిధ శాఖల అధికారులు, , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లర్ల సమస్యలు పరిష్కరించి, పెండింగ్ బిల్లులు చెల్లించాలి

*** తెలంగాణ రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: రైస్ మిల్లర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మెదక్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా చౌక్ వద్ద రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మెదక్ జిల్లా డిమాండ్ చేసింది. రైస్ మిల్లర్ల భవిష్యత్తుతో పాటు రైతులు, కార్మికుల ఉపాధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు అసోసియేషన్ పలు డిమాండ్లను ప్రభుత్వం ముందుంచింది. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ ఆకస్మిక దాడులను నిలిపివేసి, మిల్లుల్లో ప్రభుత్వ చర్యలను క్రమబద్ధీకరించాలని కోరింది. సిఎంఆర్ అగ్రిమెంట్‌ను ఇయర్‌వైజ్‌గా అమలు చేయాలని పేర్కొంది. టెస్ట్ మిల్లింగ్ ద్వారా జెట్ టెస్ట్ రికవరీని ఖరీఫ్, రబీ పంటలకు వేర్వేరుగా నిర్ణయించాలని, రిజెక్ట్ రైస్‌కు క్వింటాల్‌కు 12 కిలోల మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేసింది. క్వింటాల్ ధాన్యానికి మిల్లింగ్ చార్జీని రూ.150కు పెంచాలని, పాడి గన్నీ బ్యాగ్ ధరను రూ.11గా నిర్ణయించాలని కోరింది. రైస్ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ అధ్యక్షుడు పూట్నూరి వీరేశం, కార్యదర్శి రేకా వెంకటేశం, కోశాధికారి ఎమ్మాది లక్ష్మణ్ కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా లోని వివిధ రైస్ మిల్ యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

నేల ఆరోగ్యాన్ని కాపాడుకుందాం..

# సేంద్రియ సాగు వైపు అడుగులేద్దాం




గరిడేపల్లి ప్రజాస్ఫూర్తి: మండల పరిధిలోని వ్యవసాయం చేసే రైతులకు సేంద్రియ సాగు విధానాలపై అవగాహన కల్పించేందుకు హైదరాబాద్‌లోని చైతన్య విశ్వవిద్యాలయానికి చెందిన వ్యవసాయ రంగానికి చెందిన విద్యార్థులు గీతాంజలి, వెన్నెల, అభివర్ష, శరణ్య, షిజాజబీన్, లహరి ప్రత్యేక అవగాహన సభను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో రైతులకు ఆచరణాత్మక అనుభవం అందించే శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఈ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సేంద్రియ వ్యవసాయం యొక్క ప్రాముఖ్యత, ప్రయోజనాలు, అమలు చేసే విధానాలను వివరంగా తెలియజేశారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించి మట్టి కాంపోస్ట్, పశువుల పేడ ఎరువు, వానపాముల ఎరువు (వర్మీకంపోస్ట్), జీవ ఎరువులు, సహజ క్రిమిసంహారకాలను ఉపయోగించడం ద్వారా భూమి సారాన్ని కాపాడుకోవచ్చని విద్యార్థులు సూచించారు. అలాగే పంట మార్పిడి పద్ధతులు, పచ్చిరొట్ట ఎరువుల వాడకం, ప్రకృతి సిద్ధమైన పద్ధతులలో పురుగులు మరియు కలుపు మొక్కల నియంత్రణ విధానాలపై రైతులకు చైతన్యం తెచ్చారు. సేంద్రియ సాగుతో భూమిలో బలాన్ని పెంచడం, పర్యావరణాన్ని కాపాడుకోవడం, నాణ్యమైన పంట దిగుబడి సాధించడం మరియు సుదీర్ఘకాలం స్థిరమైన వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లడం సాధ్యమవుతుందని విద్యార్థులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని, తమ సందేహాలను అడిగి విద్యార్థుల నుంచి విలువైన సలహాలను స్వీకరించారు.

# బోయవాడ పాఠశాలలో తాగునీటి కష్టాలు

*** మున్సిపల్ సాదారణ సర్వ సభ్య సమావేశంలో కౌన్సిలర్ బర్రె పూజిత- జహంగీర్**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి: భువనగిరి మున్సిపల్ పట్టణంలో మంచినీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ప్రణాళిక అవసరమని 23వ వార్డు కౌన్సిలర్ బర్రె పూజిత జహంగీర్ అన్నారు. గురువారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆమె 23 వ వార్డులో ఉన్న సమస్యలను ప్రస్తావించారు.బోయవాడ పాఠశాలలో బోరు ఎండిపోవడంతో విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. హైదరాబాద్ నుంచి కృష్ణా జలాల సరఫరాలో అంతరాయం ఏర్పడితే వారం రోజుల వరకు నీటి సరఫరా నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. గతంలో మాదిరిగా బోర్ల ద్వారా సంపులను నింపి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసే ప్రత్యామ్నాయ వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వినాయక చవితి, బతుకమ్మ పండుగల నేపథ్యంలో పారిశుధ్య పనులకు అవసరమైన మున్సిపల్ డోజర్‌కు డ్రైవర్‌ను వెంటనే నియమించాలని కోరారు. బోనాల సందర్భంగా కోట మైసమ్మ ఆలయానికి లైట్లు ఏర్పాటు చేయాలని ముందుగానే కోరినా, కేవలం ఒక లైట్, ఒక మైక్ కూడా పెట్టలేదని విమర్శించారు. తాగునీరు, పారిశుధ్యం, పండుగల సౌకర్యాలపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని బర్రె పూజిత జహంగీర్ డిమాండ్ చేశారు

# భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడిన వీరనారి ఐలమ్మ




ప్రజాస్ఫూర్తి,భైంసా : నిర్మల్ జిల్లా బైంసా మండలంలోని దేగాం గ్రామంలో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆమెకు శ్రద్ధాంజలి ఘటించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శిరం సుష్మారెడ్డి,ఉప సర్పంచ్ బాలేకర్ శివాజీ, రజక సంఘ నాయక సోదరులు కనకాపూర్ లింగం, సాయినాథ్,వార్డు మెంబర్ కనకాపూర్ సాయినాథ్, వార్డ్ మెంబర్ పాతర్ల నరేష్, పోల్కమ్ సాయి, లింగాల సుదర్శన్ గౌడ్, లక్కడి ఆనందు, కనకాపూర్ జలరం, గ్రామపంచాయతీ కార్యదర్శి విజయ్ తదితరులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కలెక్టరేట్ లో వీరనారి చాకలి

# ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం



ప్రజా స్ఫూర్తి,భైంసా : కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో గురువారం వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ముందుగా అదనపు కలెక్టర్, అధికారులతో కలిసి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో ఈడీ ఎస్సీ కార్పొరేషన్ శంకర్, సిపిఓ గంగారెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ లో ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి



ప్రజా స్ఫూర్తి ,భైంసా : కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో గురువారం వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ముందుగా అదనపు కలెక్టర్, అధికారులతో కలిసి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో ఈడీ ఎస్సీ కార్పొరేషన్ శంకర్, సిపిఓ గంగారెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: భూమి పట్టా కలిగిన ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ ఐడీ పొందాలని లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్. ప్రనుషా సూచించారు. గురువారం ఏర్పాటు చేసిన రైతువేదిక సమావేశంలో ఆమె మాట్లాడుతూ డిజిటల్ అగ్రి మిషన్‌లో భాగంగా రైతుల ఆధార్, పట్టా వివరాలను అనుసంధానించి రైతు గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే రైతు సంక్షేమ పథకాలకు ఫార్మర్ రిజిస్ట్రీ కీలకంగా మారుతుందని పేర్కొన్నారు. రైతులు పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డుతో సమీప మీ-సేవా కేంద్రాన్ని లేదా వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి రైతు గుర్తింపు కార్డు పొందాలని సూచించారు.

# ఆలోచనలకు స్వస్తి ఆశలకు ప్రాణం పోయాలి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : నలంద డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఆత్మహత్యల నిరోధక దినోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. వైస్ ప్రిన్సిపాల్ కె. శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కళాశాల కరస్పాండెంట్ డా. డోలి సత్యనారాయణ, సామాజికవేత్త కొలిపాక వెంకన్న హాజరయ్యారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మహత్యలను నివారించవచ్చనే అవగాహనను ప్రజల్లో పెంచడమే ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశమన్నారు. దేశంలో 8 శాతం ఆత్మహత్యలు విద్యార్థుల్లోనే జరుగుతున్నట్లు ఎన్ సి ఆర్ బి నివేదిక వెల్లడించడం విచారకరమని, అందులో తెలంగాణ నాలుగో స్థానంలో ఉండడం భాధాకరమన్నారు. ఒత్తిడి, కుంగుబాటు, ఆందోళనలే విద్యార్థుల ఆత్మహత్యలకు ప్రధాన కారణమవుతున్నాయని పేర్కొన్నారు. ఆత్మహత్యల నివారణకు సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి రవీంద్ర అధ్యక్షతన టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయడం,ప్రతి విద్యాసంస్థలో సర్టిఫైడ్ సైకలాజికల్ కౌన్సిలర్ ను తప్పనిసరి చేయాలని సూచించడం అభినందనీయమన్నారు.ఎవరైనా ఒత్తిడిలో ఉంటే ఒంటరిగా వదిలేయకుండా సహానుభూతితో వినాలని,నిపుణుల సహాయం తీసుకోవాలని,బతికి సాధించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు ప్రసాద్,రవి, ఉప్పలయ్య,రమేష్, రాజు,కిషన్ తదితరులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షునిగా రెండవసారి అజ్మీర సురేష్ నాయక్



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షునిగా అజ్మీర సురేష్ నాయక్ వరుసగా రెండోసారి నియమితులయ్యారు. హైదరాబాద్‌లో ఎన్ఎస్ యుఐ రాష్ట్ర అధ్యక్షులు యడవల్లి వెంకటస్వామి చేతుల మీదుగా అజ్మీర సురేష్ నాయక్ నియామక పత్రాన్ని స్వీకరించారు. విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం, విద్యార్థుల హక్కుల కోసం చేపట్టిన ఉద్యమాలు, జిల్లాలో క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంలో చూపిన చురుకైన పాత్రను గుర్తించిన రాష్ట్ర నాయకత్వం మరోసారి జిల్లా అధ్యక్ష బాధ్యతలను అప్పజెప్పింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ జిల్లాలో విద్యార్థి సమస్యలపై మరింత ఉధృతంగా పోరాటం చేస్తూ యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన అన్నారు . జిల్లా అధ్యక్షునిగా ఎన్నిక కావడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

## భూపాలపల్లిలో మట్టి గణపతుల పంపిణీ




భూపాలపల్లి,(ప్రజా స్ఫూర్తి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాలకు బదులుగా మట్టి గణపతి విగ్రహాలను వినియోగించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ మేరకు గురువారం అంబేద్కర్ చౌక్, బస్టాండ్ ప్రాంతంలో ట్రాఫిక్ ఎస్ఐ ఏ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, ఏఈఎస్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా నోడల్ అధికారి డా. శ్రీకాంత్ సహకారంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 300 మట్టి గణపతి విగ్రహాలను ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పర్యావరణహిత మట్టి గణపతి విగ్రహాల వినియోగంపై డా. శ్రీకాంత్ అవగాహన సదస్సు నిర్వహించారు. పీఓపీ విగ్రహాల వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలను వివరించి, మట్టి విగ్రహాలనే వినియోగించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు 500 మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

* పంపిణీలో పారదర్శకత పాటించాలి : కలెక్టర్ రాహుల్ శర్మ



భూపాలపల్లి,(ప్రజా స్ఫూర్తి): రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను సరసమైన ధరలకు అందించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం మహాముత్తారం మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆన్‌లైన్ బిల్లింగ్ సాఫ్ట్‌వేర్, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. రైతులను యాప్ ద్వారా నమోదు చేసి విక్రయాలు చేపట్టాలని, కొనుగోలు చేసిన వెంటనే మొబైల్‌కు సందేశం వచ్చేలా చూడాలని సూచించారు. బిల్లులు, రసీదులను వాట్సాప్‌కు పంపడం ద్వారా పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, అధికారులు, పీఏసీఎస్ డైరెక్టర్లు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## శిలాఫలకానికి పిండప్రదానం చేసిన బీఆర్ఎస్ నేతలు



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): భూపాల్ పల్లి మండలం కొత్తపల్లి గ్రామం నుంచి దొమ్మడిపల్లి గ్రామం వరకు రోడ్డు నిర్మాణానికి మంజూరైన రూ.కోటి నిధులతో పనులు ప్రారంభించి ఏడాది గడుస్తున్నా ఇప్పటికీ పూర్తి చేయకపోవడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్థులు వినూత్న నిరసన చేపట్టారు. భూపాలపల్లి మండలం కొత్తపల్లి ఎస్ఎం గ్రామంలో సీఆర్ఆర్ నిధుల నుంచి రూ.కోటి మంజూరు చేసి రోడ్డు పనులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శంకుస్థాపన చేశారు. అయితే శిలాఫలకం వేసి ఏడాది గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో గురువారం శిలాఫలకం వద్ద బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు పిండప్రదానం చేసి నిరసన తెలిపారు. రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు.

## ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : వీర తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ నలభై ఒకటవ వర్ధంతి కార్యక్రమం కార్మికుల పని ప్రాంతాల్లో కొత్తగూడెం సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు . ముందుగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి భూక్యా రమేష్ పూలు మాల వేసి విప్లవ జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఏరియా కమిటీ కార్యదర్శి శివ, నాయకులు నాగేశ్వరావు, భాస్కర్, మరియు కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

## ఉత్సవాలకు భద్రతా కవచం నేరాలపై ఉక్కుపాదం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ఠ బందోబస్తు చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ డా.శబరీష్ అధికారులను ఆదేశించారు.పట్టణ పోలీస్ స్టేషన్ సమావేశ మందిరంలో డీఎస్పీలు,సీఐలు,ఎస్ఐలతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు.ప్రతి స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసే గణేష్ విగ్రహాల లెక్క,ప్రాంతాలు,నిర్వాహకుల వివరాలు కచ్చితంగా నమోదు చేయాలన్నారు. అనుమతులను ఆన్లైన్ పోర్టల్ ద్వారానే స్వీకరించాలని,ప్రతి విగ్రహానికి జియో ట్యాగింగ్ తప్పనిసరి చేయాలని సూచించారు.ప్రజల రాకపోకలకు,ట్రాఫిక్ కు అంతరాయం కలిగించేలా ప్రధాన రహదారులపై విగ్రహాలు ఏర్పాటు చేయకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మండపాల వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్, అగ్ని ప్రమాదాలు జరగకుండా ఉత్సవ కమిటీలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాలను ముందుగానే పరిశీలించి నీటి లభ్యత,వాహనాల రాకపోకలు,భద్రతా ఏర్పాట్లను పరిశీలించాలని, ఊరేగింపుల్లో డీజేలకు అనుమతి లేదని,నిబంధనలు కఠినంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి: ప్రతి కేసులో శాస్త్రీయ పద్ధతిలో దర్యాప్తు చేసి పకడ్బందీ ఆధారాలు సేకరించాలని,నిర్ణీత సమయంలో ఛార్జిషీట్లు దాఖలు చేసి కన్విక్షన్ రేటు పెంచాలని సూచించారు. సీసీటీఎన్ఎస్,ఈసాక్ష్యను సమర్థంగా వాడాలని, డయల్ 112, 100 కాల్స్ కు వెంటనే స్పందించి రెస్పాన్స్ టైం తగ్గించాలని,రాత్రి గస్తీని పటిష్ఠం చేయాలని,సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు.

## విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణంతో పాటు మంచి విద్యను అందించాలి

* జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



భువనగిరి, ప్రజా స్ఫూర్తి : మోటకొండూర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి గురువారం సందర్శించారు.ఈ సందర్భంగా గురుకుల పాఠశాల లో ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారని అందులో ఇంటర్మీడియట్ మరియు పాఠశాల స్థాయిలో చదువుతున్న విద్యార్థుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు విధులకు క్రమం తప్పకుండా హాజరవుతున్నారా అనే విషయాలను కూడా పరిశీలించారు.స్టోర్ రూమ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్, నిల్వ ఉన్న ఆహార పదార్థాల నాణ్యత, వాటి గడువు తేదీలను పరిశీలించారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా తెలుసుకొని, ఈ రోజు అందించనున్న ఆహారాన్ని స్వయంగా పరిశీలించారు. విద్యార్థినులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల లో చదివే విద్యార్థిని ఈశ్వ జాతీయ స్థాయి సైయిలింగ్ క్రీడల్లో పాల్గొన్న విషయం తెలుసుకున్న కలెక్టర్ ఆమెతో ప్రత్యేకంగా మాట్లాడారు. సైయిలింగ్ క్రీడను ఎంచుకోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయిలో సైయిలింగ్‌లో పాల్గొనాలనే తన ఆకాంక్షను విద్యార్థిని కలెక్టర్‌కు తెలిపారు. ఇందుకు అవసరమైన సహాయం, సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో డి సి ఓ మాధవి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌జెండర్లు చట్టాలను గౌరవిస్తూ గౌరవప్రదమైన జీవనం సాగించాలి

* నల్గొండ డీఎస్పీ కే. శివరాం రెడ్డి




ప్రజాస్ఫూర్తి , నల్లగొండ : నల్గొండ పట్టణ పరిధిలోని ట్రాన్స్‌జెండర్లతో నల్గొండ డీఎస్పీ కే. శివరాం రెడ్డి ప్రత్యేక అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ, ఇతరులకు ఇబ్బందులు కలగకుండా గౌరవప్రదంగా జీవించాలని ఈ సందర్భంగా డీఎస్పీ సూచించారు. వ్యాపార సంస్థలు, దుకాణాలు, ఇళ్లు, ట్రాఫిక్ సిగ్నల్స్, పండుగలు, శుభకార్యాలు తదితర సందర్భాల్లో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ బలవంతంగా డబ్బులు డిమాండ్ చేయడం లేదా వసూలు చేయడం చేయరాదని స్పష్టం చేశారు. ఎవరైనా స్వచ్ఛందంగా అందించే సహాయాన్ని మాత్రమే స్వీకరించాలని, డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేయడం,బెదిరించడం, అసభ్యకరంగా ప్రవర్తించడం, ప్రజలను వేధించడం వంటి చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజల నుంచి ట్రాన్స్‌జెండర్లపై వేధింపులు, బెదిరింపులు లేదా బలవంతపు వసూళ్లకు సంబంధించిన ఫిర్యాదులు అందితే వాటిని పరిశీలించి, నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు. అదే సమయంలో ట్రాన్స్‌జెండర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులు, వేధింపులు లేదా ఇతర చట్టపరమైన సమస్యలు ఉంటే భయపడకుండా పోలీసులను సంప్రదించాలని, పోలీస్ శాఖ తరపున అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.ఈ అవగాహన కార్యక్రమంలో సీఐలు ఆదిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐలు సైదాబాబు, షరీఫ్‌తో పాటు జిల్లాలోని పలువురు ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.



## రైస్ మిల్లర్లను డిఫాల్టర్లుగా చిత్రీకరించడం సరికాదు

* రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెరుమాళ్ల తిరుపతి

భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి) : రైస్ మిల్లింగ్ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోకుండా మొత్తం మిల్లర్లను డిఫాల్టర్లుగా చిత్రీకరించడం సమంజసం కాదని జయశంకర్ భూపాలపల్లి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెరుమాళ్ల తిరుపతి, గౌరవ అధ్యక్షుడు కోరే రవి అన్నారు. తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా గురువారం జిల్లా కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. రబీ 2025-26 సీజన్‌కు రా రైస్ డెలివరీ కోసం అదనంగా కేటాయించిన 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ముడి బియ్యంగా ఇవ్వడం ఆచరణ సాధ్యం కాదని మిల్లర్లు పేర్కొన్నారు. ఈ ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌గా మార్చి ప్రభుత్వానికి అందించేలా అనుమతించాలని కోరారు. అది సాధ్యం కాకపోతే మిగులు ధాన్యాన్ని వేలం వేసి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. రైస్ మిల్లింగ్ పరిశ్రమ రాష్ట్ర ఆర్థికాభివృద్ధితో పాటు ఉపాధి కల్పనకు గణనీయంగా దోహదపడుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం మిల్లర్లతో సమగ్రంగా చర్చించి ఆచరణాత్మక నిర్ణయాలు తీసుకుని సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు యానం సంతోష్, కార్యదర్శి రవీందర్‌రెడ్డి, ట్రెజరర్ రవి, గౌరవ అధ్యక్షులు రాజు, సదానందం, బిక్షపతి, మహేందర్, శ్రీధర్, విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

* మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): చాకలి ఐలమ్మ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా గురువారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుభాష్‌కాలనీలో ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

## నూతన ద్విచక్ర వాహనాలను ఆవిష్కరించిన ఉపసర్పంచ్




ప్రజాస్ఫూర్తి , జన్నారం : జన్నారం పట్టణంలోని శ్రీ బజాజ్ షోరూం లో నూతన బజాజ్ పల్సర్ వాహనాలను ఆవిష్కరణ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. జన్నారం మండలం పొనకల్ మేజర్ గ్రామపంచాయతి ఉప సర్పంచ్ అప్పాల జలపతి, వార్డు మెంబర్ జాజాల లత శ్రీకాంత్ చేతుల మీదుగా నూతన పల్సర్ బైక్లను ఆవిష్కరించారు.బజాజ్ కంపెనీలో కొత్తగా వస్తున్న పల్సర్ వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు షోరూం యజమాని పూదరి నర్సయ్య తెలిపారు.ఈ కొత్త బజాజ్ పల్సర్ లో ఆల్ న్యూ లుక్ తో వస్తుందని, ఇందులో డిజిటల్ స్క్రీన్, మోనో సస్పెన్షన్ వంటి ఎన్నో లేటెస్ట్ అప్డేట్స్ ఉన్నాయని వివరించారు.ఈ కార్యక్రమంలో పొనకల్ మేజర్ గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ అప్పాల జలపతి , వార్డ్ మెంబర్ జాజాల శ్రీకాంత్, షో రూమ్ సిబ్బంది, మరియు బజాజ్ షోరూం యజమాని పూదరి నర్సయ్య, పూదరి చంద్రమోహన్,లెక్కల మల్లయ్య, దాసరి రాజన్న, శ్రీరామ్ టైల్స్ యజమాని నాగరాజు,రామ టెంకి రాజయ్య, గణేష్ హోటల్ యజమాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కీతవారిగూడెంలో ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు



గరిడేపల్లి ప్రజాస్ఫూర్తి: గ్రామంలో సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రజక సంఘం అధ్యక్షుడు పాల్లెలి అంజయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రథమ పౌరులు బొల్లెపల్లి రామనాథం పాల్గొని చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.కార్యక్రమాన్ని విజయవంతం చేసిన రజక సంఘం సభ్యులకు, గ్రామ ప్రజలకు రజక సంఘం కీతవారిగూడెం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## మంగళ హారతులతో బాల గణపతికి స్వాగతం



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : చుంచుపల్లి మండలం రామాంజనేయ కాలనీ లో గల గాంధీ కాలనీ యూత్ సమక్షంలో యూత్ నాయకులు గ్రామ ఉపసర్పంచ్ కోడూరి నాగేష్ ఆధ్వర్యంలో యూత్ సభ్యులు చేత ఏర్పాటు చేస్తున్న రాముడు హనుమంతుని రూపంలో ఏర్పాటు చేస్తున్న బాల గణపతికీ స్వాగత కార్యక్రమం అదిరిపోయింది . బుధవారం రాత్రి పెద్ద ఎత్తున విద్యుత్ దీపాలంకరణ చేసి బాలగణపతికి యువకుల నృత్యాలతో మహిళలు మంగళ హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు . ఈ సందర్భంగా గాంధీ కాలనీ యూత్ నాయకులు ఉపసర్పంచ్ కోడూరి నాగేష్ మాట్లాడుతూ గాంధీ కాలనీ యూత్ సభ్యులు గ్రామస్తులు సహకారంతో వినాయకుని పూజా ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయన అన్నారు .ఈ కార్యక్రమం లో గాంధీ కాలనీ యూత్ సభ్యులు , చిన్నారులు స్థానిక గ్రామ పెద్దలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .

## తోట రంజిత్‌కు ఎన్ఎస్యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతలు



భూపాలపల్లి,(ప్రజా స్ఫూర్తి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన తోట రంజిత్‌ను ఎన్ఎస్యుఐ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు. పార్టీకి, విద్యార్థి ఉద్యమాలకు చేసిన సేవలను గుర్తించి తనకు ఈ బాధ్యతలు అప్పగించడం పట్ల రంజిత్ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, డీసీసీ అధ్యక్షుడు బట్టు కర్ణాకర్, ఎన్ఎస్యుఐ జాతీయ కోఆర్డినేటర్ మార్క అభినయ్‌గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామికి కృతజ్ఞతలు తెలిపారు.తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తొలి కర్తవ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, విద్యార్థులకు-ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తానని తెలిపారు. విద్యార్థుల హక్కులు, సంక్షేమం, విద్యా అవకాశాలు, భవిష్యత్తు కోసం నిబద్ధతతో పనిచేస్తానన్నారు.

## రవీందర్ కుటుంబానికి కానిస్టేబుల్ బ్యాచ్ తరపున రూ.లక్ష నగదు అందజేత...

చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి: గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో అకాల మరణం చెందిన ప్రముఖ రాజకీయ నాయకుడు చిగురుమామిడి మాజీజడ్పీటీసీ సభ్యుడు గీకురు రవీందర్ కుటుంబానికి ఆయన సహచర 1996కానిస్టేబుల్ బ్యాచ్ మిత్రులు అండగా నిలిచారు. గురువారం రవీందర్ స్వగృహంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి,కుటుంబ సభ్యులను పరామర్శించి,రవీందర్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం రవీందర్ కూతుళ్లకు అక్షరాలా ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా బ్యాచ్ ప్రతినిధులు మాట్లాడుతూ.ట్రైనింగ్ సెంటర్ నుంచే ఆయన అద్భుతమైన నాయకత్వ లక్షణాలను ప్రదర్శించి,మొత్తం బృందానికి నాయకత్వం వహించారని కొనియాడారు. సిరిసిల్లలో పోలీస్ ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించిన అనంతరం తెలంగాణ స్వరాష్ట్ర సాధనే ధ్యేయంగా,ప్రజాసేవ చేయాలనే బలమైన సంకల్పంతో తన ఉద్యోగానికి రాజీనామా చేశారని తెలిపారు.ఆ తర్వాత రాజకీయాల్లోకి ప్రవేశించి చిగురుమామిడి మండలంలో రెండు సార్లు సర్పంచ్‌గా, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడిగా,చిగురుమామిడి జడ్పీటీసీగా ప్రస్తుతం కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ వావిలాల మల్లారెడ్డి,ముదిరాజ్ సంఘం పెద్దమనిషి చెరుకు చిన్నసమ్మయ్య,గుండా కృష్ణకుమార్ గౌడ్, పుప్పాల శ్రీనివాస్, శంకర్ రెడ్డి, ముత్యాల బ్రహ్మయ్య, కనకయ్య, దామోదర్ రెడ్డి, కాంతారావు, సదాచారి,సుధాకర్ తదితర బ్యాచ్ సభ్యులు పాల్గొన్నారు.

## సీఎంను కలిస్తే కాంప్రమైజ్.. లేకపోతే గ్యాప్ అంటారు

**: రాజగోపాల్‌రెడ్డి**



హైదరాబాద్: నిధుల కోసం సీఎం రేవంత్ ను కలిస్తే తప్పేంటని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రశ్నించారు. నియోజకవర్గ అభివృద్ధి జరగాలంటే సీ ఎం, డిప్యూటీ సీ ఎం ను కలవాల్సిందేనని చెప్పారు. సీఎంతో తనకు అభిప్రాయబేధాలు మాత్రమే ఉన్నాయన్నారు. మంచి జరిగితే మంచి.. చెడు జరిగితే చెడు అని చెప్పడం తన నైజమన్నారు. మీడియాతో రాజగోపాల్‌రెడ్డి చిట్‌చాట్ నిర్వహించారు. ‘‘సీఎం రేవంత్, నేను ఎప్పుడూ తిట్టుకోవాలని కొందరు చూస్తున్నారు. మంత్రి పదవి కోసం సీఎం దగ్గర రాజీపడినట్లు ప్రచారం చేస్తున్నారు. మంత్రి పదవి ఇచ్చేది అధిష్ఠానం. ఆ పదవి ఇస్తానని హైకమాండ్ మాటిచ్చింది. అధిష్ఠానం ఏం చెబితే అది చేయడానికి సిద్ధంగా ఉన్నా. సీఎంను కలిస్తే కాంప్రమైజ్.. కలవకపోతే గ్యాప్ పెరిగిందని ప్రచారం చేస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో భిన్నాభిప్రాయాలు ఉండటం సహజం. కొండా సురేఖ విషయంలో అధిష్ఠానానికి సీఎం రేవంత్ చెప్పడంలో తప్పేమీ లేదు. ఇందిరమ్మ ఇళ్లకు ఇచ్చే రూ.ఐదు లక్షలు చిన్నమొత్తమేమీ కాదు’’ అని రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

## తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి బెయిల్ రద్దు చేయండి..

**కోర్టులో పోలీసుల పిటిషన్**




హైదరాబాద్: స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల కేసులో భారాస ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్‌రెడ్డికి లభించిన బెయిల్‌ను రద్దు చేయాలంటూ సైఫాబాద్ పోలీసులు నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు విధించిన బెయిల్ షరతులను నిందితులు ఉల్లంఘించారని పోలీసులు పిటిషన్‌లో పేర్కొన్నారు. బెయిల్‌పై బయటకు వచ్చిన అనంతరం కోర్టు నిబంధనలకు బేఖాతరు చేస్తూ వారు మీడియా పాయింట్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో అనుచిత వ్యాఖ్యలు చేశారని పోలీసులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు సంబంధించిన వీడియో క్లిప్పింగ్‌లు, డిజిటల్ ఆధారాలను సమర్పించారు. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినందుకు వెంటనే బెయిల్ రద్దు చేయాలని కోరారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ కేసులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్లు నమోదై ఉన్నాయని పోలీసులు గుర్తుచేశారు. అందుకే ఈ కేసును తదుపరి విచారణ నిమిత్తం ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టుకు బదిలీ చేయాలని పోలీసులు నాంపల్లి కోర్టును కోరారు.

## చెరువుల్లో నిమజ్జనాలకు మేం వ్యతిరేకం కాదు

**: హైడ్రా కమిషనర్ రంగనాథ్**

హైదరాబాద్: నగరంలో గణేశ్ నిమజ్జనాలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. చెరువుల్లో నిమజ్జనాలకు హైడ్రా వ్యతిరేకం కాదన్నారు. సోషల్ మీడియాలో హైడ్రా (Hydraa)పై దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ‘‘కేంద్రం నోటిఫై చేసిన 45 చెరువుల్లోనే గణేశ్ నిమజ్జనంపై ఆంక్షలు ఉన్నాయి. అమీన్‌పూర్, కాప్రా చెరువుల్లో ఆంక్షలు విధించారు. దేశంలో ప్రప్రథమంగా అమీన్‌పూర్ చెరువును బయోడైవర్సిటీగా, నేచురల్ వెట్‌ల్యాండ్ కింద కాప్రా చెరువును కేంద్రం గుర్తించింది. హైడ్రా పునరుద్ధరిస్తున్న చెరువుల వద్ద ఎలాంటి ఆంక్షలు లేవు.

## బ్యాండ్ కళాకారులకు ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి

* **గుమ్మడి రాజు నాగరాజు రాష్ట్ర కార్యదర్శి**



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : తెలంగాణ బ్రాండ్ వాయిద్య కళాకారుల సంఘం ఖమ్మం జిల్లా సదస్సు ఎంబి గార్డెన్లో ఎస్.కె జానీ అధ్యక్షతన జరిగింది సదస్సు కంటే ముందు కాలువొడ్డు నుండి ఎంబి గార్డెన్ వరకు బ్యాండ్ వాయిద్య కాలమేళాలతో ర్యాలీ నిర్వహించారు అనంతరం సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మడి రాజు నాగరాజు మాట్లాడుతూబ్యాండ్ కళాకారులకు సాంస్కృతిక శాఖ నుండి న్యాయం జరగట్లేదని కనుకనే బ్యాండ్ బ్యాండ్ ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు రాష్ట్రఅధ్యక్షులు చాంద్పాషామాట్లాడుతూ బ్యాండ్ కళాకారుల ఐక్యత సాధించాలని ఐక్య ఉద్యమాలు పోరాటాలు చేసుకుని మన సమస్యల్ని మనమే పరిష్కరించుకోవాలని మనకోసం ఏ రాజకీయ పార్టీ ముందుకు రాదు ఓటు బ్యాంకుగా లేవు చిన్న చిన్న కులాలకు ఇచ్చిన విలువ కూడా బ్యాండ్ కళాకారులకు ఇవ్వడం లేదని అన్నారు. వృత్తి సంఘాల జిల్లా కన్వీనర్ ఎర్ర శ్రీనివాస్ మాట్లాడుతూ ఏ సమస్య అయినా పోరాడనిది పరిష్కారం కాదు ఈరోజు వృత్తి కులాలలో ఉండే అన్ని సంఘాలు పోరాడే హక్కులు సాధించుకున్నాయి కనుక బ్యాండ్ కళాకారులు ఐక్య కమిటీలు అన్ని మండల కమిటీలు వేసుకొని ముందుకు వెళ్లాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు దండగల శ్రీనివాస్ దండగల రాంబాబు ఎస్.కె కాజా ఎస్కే హుస్సేన్ జానీ చిన్న మౌలాలి మధు మల్లికార్జున్ గోవిందరావు, నాగరాజు వెంకన్న వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా డంపింగ్ యార్డు ఏర్పాటు సరికాదు

* **మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**
* **బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**




ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : సిద్దాపూర్ ప్రాంతంలో డంపింగ్ యార్డు ఏర్పాటు ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి ముప్పు కలిగించే నిర్ణయాలను ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ముందుకు తీసుకెళ్లడం సరికాదన్నారు. డంపింగ్ యార్డు వల్ల సమీప ప్రాంతాల్లో దుర్వాసన, వాయు కాలుష్యం, భూగర్భ జలాల కలుషితం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే జనావాసాల మధ్య పర్యావరణ సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలపై మరింత భారాన్ని మోపడం అన్యాయమన్నారు. సిద్దాపూర్ డంపింగ్ యార్డు విషయంలో ప్రజల అభిప్రాయాన్ని గౌరవించి, ఈ ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలి” అని అంజయ్య యాదవ్ స్పష్టం చేశారు. సిద్దాపూర్ డంపింగ్ యార్డు రద్దు కోసం తెలంగాణ సమాఖ్య, ఎస్డివిపి జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజా ఉద్యమానికి తన పూర్తి మద్దతు ఉంటుందని ఆయన తెలిపారు. ప్రజల న్యాయమైన డిమాండ్ పరిష్కారం అయ్యే వరకు ప్రజల తరపున తన వాణిని వినిపిస్తానని పేర్కొన్నారు.

## పుష్కరాల పనులన్నీ శాఖల సమన్వయంతో చేపట్టాలి

* **జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**



ప్రజా స్ఫూర్తి, భైంసా : బాసరలో పుష్కరాల పనులపై జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి అధికారులతో సమీక్ష చేసిన జిల్లా కలెక్టర్ గోదావరి పుష్కరాల పనులన్నీ శాఖల మధ్య సమన్వయంతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, జిల్లా ఎస్పీ జానకి షర్మిల తో కలిసి బాసర ఈవో కార్యాలయంలో గోదావరి పుష్కరాల పనులపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాసరలో పుష్కరాలకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు, వీఐపీ, వీవీఐపీ భక్తులకు ప్రత్యేకంగా పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. పుష్కరాల నిర్వహణ, భక్తుల రద్దీ నియంత్రణ, సంఖ్య లెక్కింపు అంశాల్లో ఏఐ సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలన్నారు. చేపట్టే పనులను సంబంధిత ఇంజనీరింగ్ శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ పుష్కరాలకు వచ్చే భక్తులకు తగిన భద్రత కల్పిస్తామని అన్నారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయంతో ఉండి, భక్తులకు ఇబ్బందులు లేకుండా పోలీసు శాఖ తరపున సహకారం అందిస్తామన్నారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి, ఆర్డబ్ల్యుఎస్, పంచాయితీరాజ్, నీటిపారుదల శాఖల ఈఈ లు సుభాష్, సందీప్, శంకరయ్య, అనిల్, ఆలయ ఈవో అంజనా దేవి, తహసిల్దార్ పవన్ చంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ శస్త్ర చికిత్సల్లో విప్లవాత్మక మార్పులు

* **ఆధునిక సాంకేతికతతో మరింత ఖచ్చితమైన చికిత్స**
* **సీనియర్ శస్త్ర చికిత్స నిపుణుడు డా. రాజేష్ గౌడ్**




ప్రజాస్ఫూర్తి, షాద్నగర్ : క్యాన్సర్ శస్త్ర చికిత్స రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విప్లవాత్మక మార్పులకు దారితీస్తోందని సీనియర్ శస్త్ర చికిత్స నిపుణుడు, రోబోటిక్ శస్త్ర వైద్యుడు డా. రాజేష్ గౌడ్ అన్నారు. క్యాన్సర్‌ను తొలగించడంతో పాటు రోగి జీవన నాణ్యతను కాపాడటమే ఆధునిక చికిత్సల ప్రధాన లక్ష్యమని తెలిపారు. హైటెక్ సిటీ యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం షాద్‌నగర్‌లోని దేవి గ్రాండ్ సమావేశ హల్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత దశాబ్ద కాలంలో క్యాన్సర్ చికిత్సలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. రోబోటిక్ శస్త్రచికిత్స ద్వారా చిన్న రంధ్రాల ద్వారా ఆపరేషన్లు నిర్వహించే అవకాశం ఉండటంతో రోగులకు తక్కువ నొప్పి, తక్కువ రక్తనష్టం, చిన్న మచ్చలు, త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. మహిళల్లో గర్భాశయ, అండాశయ క్యాన్సర్లతో పాటు రొమ్ము క్యాన్సర్ చికిత్సలోనూ ఆధునిక పద్ధతులు ఉపయోగపడుతున్నాయని చెప్పారు. ప్రోస్టేట్, మూత్రాశయ, మూత్రపిండాల క్యాన్సర్ల చికిత్సలోనూ రోబోటిక్ శస్త్రచికిత్సలు కీలకంగా మారుతున్నాయని అన్నారు. మూత్రపిండ క్యాన్సర్‌లో కణితి ఉన్న భాగాన్ని మాత్రమే తొలగించి ఆరోగ్యకరమైన భాగాన్ని కాపాడే అవకాశం ఉంటుందని వివరించారు. పెద్దపేగు, మలద్వార, ఊపిరితిత్తుల క్యాన్సర్ల చికిత్సలోనూ చిన్న కోతలతో శస్త్రచికిత్సలు నిర్వహించే ఆధునిక విధానాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ప్రత్యేక కాంతి సహాయంతో క్యాన్సర్ ప్రభావిత కణజాలం, శోషరస మార్గాలను గుర్తించే సాంకేతికతతో శస్త్రచికిత్సల్లో మరింత ఖచ్చితత్వం సాధించే అవకాశం ఉందన్నారు. కృత్రిమ మేధస్సు, ఆధునిక సాంకేతికతలతో భవిష్యత్తులో క్యాన్సర్ చికిత్స మరింత సమర్థవంతంగా మారుతుందని డాక్టరు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆసుపత్రి ప్రతినిధులు లలిత్ శర్మ, దయశ్వర్ తదితరులు ఉన్నారు.

## క్షేత్రస్థాయిలో పరిశీలన నాణ్యతపై ఆరా



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ పట్టణంలోని 28వ వార్డులో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పురపాలక చైర్ పర్సన్ గుగులోతు జ్యోతి రమేష్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పక్కా కాలువలు, మురుగునీటి వ్యవస్థ, సిమెంటు రహదారుల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి నాణ్యతపై ఆరా తీశారు. పనుల విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని, ప్రజలకు దీర్ఘకాలం ఉపయోగపడే విధంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.పట్టణాన్ని పరిశుభ్రంగా, అందంగా, అన్ని వసతులతో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా శాసనసభ్యులు మురళీ నాయక్ కృషితో ముందుకు సాగుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో 28వ వార్డు సభ్యులు బొల్లు రాజు, పురపాలక అధికారి వినోద్ కుమార్, వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సైబరాబాద్ పోలీస్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం

* **నూతన సభ్యులకు సీపీ డా. రమేష్ అభినందనలు**




సైబరాబాద్, ప్రజాస్ఫూర్తి : సైబరాబాద్ పోలీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా ఎస్సై శ్రీనివాస్ (హెచ్‌సీ-3046), ఉపాధ్యక్షుడిగా ఇన్‌స్పెక్టర్ శ్రీకర్‌బాబు (19435) ఎన్నికయ్యారు. ఎస్సై/ఏఎస్సై కేటగిరీలో ప్రియదర్శిని (3251), హెడ్ కానిస్టేబుల్ కేటగిరీలో కార్తిక్ శ్రీనివాస్ (3276), పోలీస్ కానిస్టేబుల్ కేటగిరీలో రాజేందర్ (5180) వైస్ ప్రెసిడెంట్లుగా ఎన్నికయ్యారు.వివిధ పదవులకు మొత్తం 29 మంది సభ్యులు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీ వారికి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ ద్వారా సిబ్బంది సంక్షేమం, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

## ప్రేమ పెళ్లి.. గద్వాలలో జేసీబీలతో యువకుడి ఇంటి కూల్చివేత



గద్వాల: జోగులాంబ గద్వాల జిల్లాలో దారుణం చోటుచేసుంది. ప్రేమ వివాహం చేసుకున్న దళిత యువకుడి ఇంటిని యువతి కుటుంబ సభ్యులు కూల్చేశారు. గద్వాల మండలం రేపల్లెలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఓ యువతి, యువకుడు ఇటీవల హైదరాబాద్‌లో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న యువతి కుటుంబ సభ్యులు ఆగ్రహంతో యువకుడి ఇంటిపై దాడికి పాల్పడ్డారు. జేసీబీలతో ఇంటిని కూల్చివేశారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పోలీసులు అక్కడికి చేరుకున్నారు.

## యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ లో ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండా ఇన్వాసివ్ మిట్రాక్లిప్ ప్రొసీజర్ ద్వారా అరుదైన శాస్త్ర చికిత్స




ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : యశోద మెడికల్ సెంటర్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ కార్డియాలజీ డాక్టర్ కళా జితేందర్ జైన్ మాట్లాడుతూ గుండె , ఊపిరితిత్తుల సమస్యలతో అత్యంత విషమ స్థితిలో ఉన్న 60 ఏళ్ల పేషెంట్‌కు , యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ కార్డియాలజీ మరియు పల్మోనాలజీ బృందాలు విజయవంతంగా 'మినిమల్లీ ఇన్వాసివ్ మిట్రాక్లిప్' ప్రొసీజర్‌ను చేసి ఒక ముఖ్యమైన మైలురాయిని సాధించాయి . ఆ పేషెంట్ దాదాపు మూడు వారాలుగా వెంటిలేటర్ సపోర్ట్‌పై ఉన్నారు . అంతేకాకుండా , తీవ్రమైన మిట్రల్ రిగర్గిటేషన్ (ఎంఆర్ గుండె కవాటం సమస్య)తో బాధపడుతున్నారు . దీనివల్ల ఆయనకు పదే పదే హార్ట్ ఫెయిల్యూర్ సమస్య ఎదురైంది . పేషెంట్ గుండెలోని మిట్రల్ వాల్వ్ సరిగ్గా మూసుకోకపోవడం వల్ల , రక్తం వెనక్కి ప్రవహించి గుండెపై తీవ్రమైన ఒత్తిడి పడుతోంది . పేషెంట్ యొక్క విషమ పరిస్థితి , ఊపిరితిత్తుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని , డాక్టర్లు మినిమల్లీ ఇన్వాసివ్ పద్ధతిని ఎంచుకున్నారు . ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండానే మిట్రల్ రిగర్గిటేషన్‌ను తగ్గించే ఈ 'మిట్రాక్లిప్' ప్రొసీజర్‌ను కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కళా జితేందర్ జైన్ , కార్డియాలజీ బృందం, సీనియర్ కన్సల్టెంట్ (క్లినికల్ & ఇంటర్వెన్షనల్ పల్మోనాలజీ) డాక్టర్ వి. నాగార్జున మాటూరు మరియు క్రిటికల్ కేర్ బృందంతో సమన్వయం చేసుకుంటూ విజయవంతంగా పూర్తి చేశారు . పేషెంట్ పరిస్థితి చాలా విషమంగా ఉండటం , తీవ్రమైన మిట్రల్ రిగర్గిటేషన్ , ఊపిరితిత్తుల సమస్యలు ఉండటం , అలాగే కొన్ని వారాల పాటు వెంటిలేటర్ పైనే ఉండటం వల్ల ఇది చాలా సవాలుతో కూడుకున్న కేసు . ఇలాంటి హై రిస్క్ పేషెంట్లకు , సాధారణ ఓపెన్ హార్ట్ సర్జరీకి బదులుగా మిట్రాక్లిప్ లాంటి మినిమల్లీ ఇన్వేసివ్ విధానం ఒక మంచి ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతుంది . ఈ ప్రొసీజర్ విజయవంతం కావడంతో పేషెంట్ గుండె పరిస్థితి మెరుగుపడింది . అలాగే పెద్ద సర్జరీ వల్ల వచ్చే ప్రమాదాలను నివారించి , పేషెంట్ త్వరగా కోలుకునేలా చేయగలిగాము,” అని అన్నారు . ఈ ప్రొసీజర్ తర్వాత , పేషెంట్ ఆరోగ్య పరిస్థితిలో గణనీయమైన మెరుగుదల కనిపించింది. చికిత్స జరిగిన కేవలం నాలుగు రోజులకే ఆయనను హాస్పిటల్ నుండి విజయవంతంగా డిశ్చార్జ్ చేశారు . యశోద హాస్పిటల్స్ యొక్క మల్టీడిసిప్లినరీ విధానం , అత్యాధునిక ఇంటర్వెన్షనల్ కార్డియాక్ సామర్థ్యాలు , అలాగే కార్డియాక్, పల్మనరీ , క్రిటికల్ కేర్ విభాగాల సమన్వయంతో అత్యంత సంక్లిష్టమైన , హైరిస్క్ గుండె పేషెంట్లకు సైతం మెరుగైన చికిత్స అందించగల సత్తాకు ఈ విజయమే ఒక నిదర్శనం అని అన్నారు . ఖమ్మం యశోద మెడికల్ సెంటర్ నందు ప్రతి నెల 2వ 4వ బుధవారాలు అందుబాటులో ఉంటానని తెలిపారు . ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్స్ డి. బాలరాజు , డి. శ్రీకాంత్ పాల్గొన్నారు.

# MOVIE TIME



## ఆయన వల్లే మళ్లీ తెర పైకి

భర్త రాజ్ నిడిమోరుపై సమంత ప్రశంసలు కురిపించింది. ప్రెగ్నెన్సీ కారణంగా సినిమాలకు బ్రేక్ ఇచ్చిన ఆమె మా ఇంటి బంగారం ముందు తన కెరీర్‌లో ఎదురైన కష్టాలపై ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర కామెంట్లు చేసింది. సెట్స్‌లో అందరూ మేకప్ వేసుకొని నా కోసం ఎదురుచూసేవాళ్లు. నా వల్లే టైమ్ వేస్ట్ అనే భావన ప్రతి ఒక్కరిలో కనిపించేది. నా వల్ల ఇంకొకరు ఇబ్బందులు పడొద్దనుకుని సినిమాలు మానేయాలని ఫిక్సయ్యా. చాలా స్క్రిప్ట్‌లు రిజెక్ట్ చేశా. ప్రొడ్యూసర్‌గా సినిమాలు చేస్తూ తెర వెనుకే ఉండిపోవాలనుకున్నా. ఆ టైమ్‌లోనే రాజ్ నా లైఫ్‌లోకి వచ్చాడు. నాలో ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపాడు. కష్టకాలంలో నన్ను మరింత స్ట్రాంగ్‌గా మార్చాడు అంటూ చెప్పుకొచ్చింది సమంత. ప్రస్తుతం ఆమె కామెంట్స్ వైరలవుతున్నాయి.



## అనస్వర జోరు

మలయాళ బ్యూటీ అనస్వర రాజన్ టాలీవుడ్‌లో తన జోరు పెంచుతోంది. దర్శకనిర్మాతలు ఈ అమ్మడి డేట్స్ కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం టాలీవుడ్‌లో మూడు సినిమాలు చేస్తోంది ఈ చిన్నది. చిరంజీవి కాకాలో ఓ కీలక పాత్రలో నటిస్తున్న ఈ మలయాళ భామ మరో రెండు సినిమాల్లో కథానాయికగా కనిపించబోతుంది. ప్రస్తుతం ఇట్లు అర్జునతో పాటు అంతా రాములోరు చూస్కుంటారు సినిమాలు చేస్తోంది. అక్టోబర్ 9న రిలీజ్ కాబోతున్న ఇట్లు అర్జున మూవీని డైరెక్టర్ వెంకీ కుడుముల నిర్మిస్తున్నారు. ఈ మూడు సినిమాలే కాకుండా 7జీ బృందావన కాలనీ సీక్వెల్‌లో ఈ మలయాళ ముద్దుగుమ్మ నటిస్తోంది. హీరోయిన్‌గా మరో రెండు కొత్త సినిమాలు కూడా డిస్కషన్స్ స్టేజ్‌లో ఉన్నట్లు సమాచారం.



## తెలంగాణ యాస నేర్చుకొని..

పెళ్లి బరాత్‌లో మాస్ స్టెప్పులు వేసింది అనుపమ పరమేశ్వరన్. క్రేజీ కళ్యాణం ఫస్ట్ సింగిల్ ప్రోమోను మేకర్స్ తాజాగా రిలీజ్ చేశారు. ఈ ప్రోమోలో పెళ్లి కూతురు గెటప్‌లో ఉన్న అనుపమ బరాత్‌లో డ్యాన్స్‌తో దుమ్ము రేపింది. కాకా ధూమ్ ధమాకా అంటూ సాగే ఈ పాటలో ఈ అమ్మడితో పాటు సీనియర్ నరేష్, తరుణ్ భాస్కర్ కలిసి డ్యాన్స్ చేయబోతున్నారు. తన పాత్ర కోసం తెలంగాణ యాస నేర్చుకొని సొంతంగా డబ్బింగ్ చెప్పింది అనుపమ. ఆమె ఓన్ వాయిస్ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలవబోతున్నట్లు మేకర్స్ వెల్లడించారు. నవంబర్‌లో ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సమాచారం. ఈనెల 12న ఫుల్ సాంగ్ రిలీజ్ కాబోతుంది. ఈ సాంగ్‌కు కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించగా సురేష్ బొబ్బిలి మ్యూజిక్ సమకూర్చారు.



## వెంకటేశ్వర స్వామిగా టాలీవుడ్ ఎంట్రీ

కోలీవుడ్ అగ్ర నటుడు జయం రవి టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నారు. మంచు మనోజ్ హీరోగా వడ్డీకాసుల వాడ పేరుతో సోషియా ఫాంటసీ కామెడీ మూవీ తెరకెక్కుతోంది. ఈ సినిమాలో వెంకటేశ్వర స్వామి పాత్రలో జయం రవి కనిపించబోతున్నాడు. ఈ విషయాన్ని జయం రవి ట్విట్టర్ ద్వారా గురువారం అఫీషియల్‌గా ప్రకటించారు. అప్పులు, ఈఎంఐల బాధ నుంచి బయటపడేందుకు ఓ మిడిల్ క్లాస్ యువకుడు చేసే ప్రయత్నాలను వినోదాత్మకంగా చూపించబోతున్నారు. వడ్డీకాసుల వాడ పేరుతో తెరకెక్కుతున్న ఈ మూవీకి తేజ్ ఉప్పలపాటి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను అనిల్ సుంకర నిర్మిస్తున్నారు. కాగా పుట్టినరోజు సందర్భంగా దేవుడు ఇచ్చిన గిఫ్ట్ ఇది అంటూ ఓ పోస్టర్‌ను అభిమానులతో పంచుకున్నాడు రవి. వచ్చే ఏడాది సంక్రాంతికి రిలీజ్ కానున్నట్లు టాక్ వినిపిస్తుంది.



ఈ వినాయక చవితిని పర్యావరణ హితంగా జరుపుకోవాలని రౌడీ హీరో విజయ్ దేవరకొండ పిలుపునిచ్చారు. అందరూ సురక్షితమైన మట్టి గణపతి, విత్తన గణపతిని వాడాలని.. తద్వారా మన నగరం కలుషితం కాకుండా చూడాలన్నారు. గ్రీన్ ఇండియా చాలెంట్ ప్రతినిధులు ఆయన నివాసంలో విత్తన గణపతి ప్రతిమను విజయ్ కు అందేశారు. అనంతరం విజయ్ మాట్లాడుతూ.. తాను ఇప్పడే విత్తన గణపతిని స్వీకరించానని.. పూజల తర్వాత ఈ విగ్రహం నుంచి మొక్క పెరుగుతుందని తెలిపారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.